https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సారధ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక



హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 19 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ గురువారం,అక్టోబర్,15, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

దేశాన్ని ఎందుకు నాశనం చేస్తున్నావ్?

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో అభిజిత్ దీప్కేకు నిరసన సెగ

న్యూఢిల్లీ,అక్టోబర్,14:కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు ఢిల్లీలో చేదు అనుభవం ఎదురైంది. బుధవారం ఆయన ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన వెంటనే ఒక వ్యక్తి ఆయనను అడ్డుకుని నిలదీశారు. “దేశాన్ని ఎందుకు నాశనం చేస్తున్నారు?” అంటూ ఆ వ్యక్తి గట్టిగా అరవడంతో ఎయిర్‌పోర్ట్‌లో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే, దీప్కే మాత్రం నవ్వుతూ, నిరసనకారుడికి థమ్సప్ చూపిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అక్టోబర్ 10న తన నానమ్మ మరణించడంతో స్వస్థలమైన మహారాష్ట్రకు వెళ్లిన దీప్కే, బుధవారం మధ్యాహ్నం తిరిగి రాజధానికి చేరుకున్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 10న నిరసనలకు నాయకత్వం వహించేందుకు వచ్చినప్పుడు కూడా పోలీసులు ఆయనను విమానం నుంచి అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఢిల్లీలో అడుగుపెట్టిన వెంటనే, తన సహచరులు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లను అరెస్ట్ చేసి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. “త్రివర్ణ



పతాకాన్ని ఎగరేయడం నేరమా? కేవలం జంతర్ మంతర్ వద్ద జాతీయ జెండాను ఎగరేసినందుకే అశుతోష్, సౌరవ్‌లను ఐదు రోజులు జైలుకు పంపారు. గతంలో బ్రిటిష్ పాలనలో ఇలా జరిగేది. అప్పట్లో స్వాతంత్ర్య సమరయోధులు బహిరంగ ప్రదేశాల్లో జెండా ఎగరేస్తే అరెస్ట్ చేసి జైల్లో పెట్టేవారు” అని దీప్కే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఢిల్లీలో దారుణం.. బైక్‌పై వచ్చి యువకుడిని కాల్చి చంపిన దుండగులు



దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. సోనియా విహార్ ప్రాంతంలో మంగళవారం రాత్రి ఇద్దరు దుండగులు జరిపిన కాల్పుల్లో మనీశ్ యాదవ్ (34) అనే వ్యక్తి దారుణంగా హత్యకు గురయ్యాడు.ఘటన వివరాల్లోకి వెళ్తే.. సోనియా విహార్‌లోని 4.5 పుష్టా సర్వీస్ రోడ్డులో నివాసముంటున్న మనీశ్ యాదవ్‌పై మంగళవారం రాత్రి 9:13 గంటల సమయంలో దుండగులు దాడికి తెగబడ్డారు. హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన మనీశ్‌ను కుటుంబ సభ్యులు వెంటనే సివిల్ లైన్స్‌లోని ఎయిమ్స్ శ్రుత ట్రామా సెంటర్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు కోల్పోయారు.ఈ ఘటనపై సోనియా విహార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భారతీయ న్యాయ సంహిత, ఆర్మ్స్ యాక్ట్ కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఫోరెన్సిక్ బృందాలు ఘటనా స్థలాన్ని పరిశీలించి కీలక ఆధారాలు సేకరించాయి.

వచ్చే బతుకమ్మ నాటికి ఇందిరమ్మ

ఇళ్ల అప్పగింత: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, అక్టోబర్ 14: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ వివక్షకు తావులేదని, అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అర్హులైన పేదలందరికీ ఇళ్లు కేటాయిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలోని పోచారంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందిరమ్మ టవర్స్ పనులకు 23 నియోజకవర్గాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఫ్లాట్లు కేటాయిస్తామని, లబ్ధిదారులకు ఫ్లాట్‌తో పాటు భూమిలో వాటాకు సంబంధించిన హక్కులు కూడా కల్పిస్తామని చెప్పారు. అంతేకాకుండా, ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించడమే లక్ష్యమని వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు



చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇళ్లను కేటాయిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.440 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

మీరట్ బ్లూ డ్రమ్ హత్య కేసులో సంచలన తీర్పు..

భార్య, ప్రియుడికి మరణశిక్ష..!

- నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య- మృతదేహాన్ని సిమెంట్ నింపిన డ్రమ్‌లో దాచిన నిందితులు

-22 మంది సాక్షుల వాంగ్మూలాల పరిశీలన-ఫోన్ రికార్డులు, ఇతర ఆధారాలతో కేసు నిరూపణ



లక్నో,అక్టోబర్,14: ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మీరట్ బ్లూ డ్రమ్ హత్య కేసులో కీలక తీర్పు వెలువడింది. నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్‌ను హత్య చేసిన కేసులో ఆయన భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాకు స్థానిక కోర్టు మరణశిక్ష విధించింది. 126 విచారణల తర్వాత 22 మంది సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. 2025 మార్చి 3న ముస్కాన్ తన భర్తకు ఆహారంలో మత్తుమందు కలిపి ఇచ్చిందని, ఆ తర్వాత సాహిల్‌తో కలిసి కత్తితో పొడిచి హత్య చేసినట్లు ప్రాసిక్యూషన్ వెల్లడించింది. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా చేసి, ఇసుక, నీరు, సిమెంట్‌తో నింపిన నీలిరంగు ప్లాస్టిక్ డ్రమ్‌లో దాచినట్లు దర్యాప్తులో తేలింది. హత్య జరిగిన మరుసటి రోజు ఇద్దరూ హిమాచల్‌ప్రదేశ్‌కు వెళ్లిపోయారు. సౌరభ్ బతికే ఉన్నట్లు నమ్మించేందుకు ముస్కాన్ ఆయన ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు సందేశాలు పంపినట్లు పోలీసులు గుర్తించారు. మార్చి 17న బంధువులు అనుమానంతో అధికారులతో కలిసి ఇంటికి వెళ్లగా డ్రమ్‌లో సౌరభ్ మృతదేహం బయటపడింది. అనంతరం పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. డ్రమ్, సిమెంట్, ఇసుక, కత్తులు కొనుగోలు చేసిన దుకాణదారుల వాంగ్మూలాలతో పాటు ఫోన్ కాల్ రికార్డులు, మొబైల్ లొకేషన్ వివరాలను పోలీసులు సాక్ష్యాలుగా సమర్పించారు. నిందితులు నేరానికి పాల్పడినట్లు ఈ ఆధారాలు నిరూపించాయని ప్రాసిక్యూషన్ వాదించింది.

టీటీడీ కల్తీ నెయ్యి కేసులో కీలక మలుపు..

రూ.130 కోట్ల ఆస్తులను జప్తు చేసిన ఈడీ

అమరావతి, అక్టోబర్ 14: తిరుమల తిరుపతి దేవస్థాన లడ్డూ ప్రసాద తయారీలో కల్తీ నెయ్యి వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దేవస్థానానికి కల్తీ నెయ్యిని సరఫరా చేసిన బోలేబాబా, వైష్ణవి డెయిరీ సంస్థలకు చెందిన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. టీటీడీకి రూ.234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైన నేపథ్యంలో భోలే బాబా, శ్రీ వైష్ణవి డెయిరీ, సుకృతి ఫుడ్స్‌కు చెందిన ఆస్తుల అటాచ్ చేసుకున్నట్లు ఈడీ తెలిపింది. ఈ సంస్థలు టెండర్లలో పాల్గొన్న ఫ్రంట్ డెయిరీల ద్వారా టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు గుర్తించామని ఈడీ వెల్లడించింది. నకిలీ కొనుగోళ్లు, అమ్మకాలతో లావాదేవీలను నిజమైనవిగా చూపించినట్లు గుర్తించామని తెలిపింది. బ్యాంకు లావాదేవీల ద్వారా చెల్లింపులు చేసి, హవాలా మార్గంలో నగదు వెనక్కి మళ్లించారని



భావిస్తోన్నట్లు అధికారులు తెలిపారు. సంస్థల ప్రమోటర్లు విపిన్ జైన్, కైలాష్ చంద్ర మంగ్లా, వారి కుటుంబ సభ్యుల ఆస్తులపైనా చర్యలు తీసుకుంటున్నట్లు వారు వెల్లడించారు.

అఖిలేష్ యాదవ్‌కు షాక్.. బీజేపీలో చేరిన ఎస్పీ రెబల్ ఎమ్మెల్యేలు



సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్‌కు షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ముగ్గురు తిరుగుబాటు ఎమ్మెల్యేలు బుధవారం బీజేపీలో చేరారు. 2022లో ఈ ముగ్గురూ ఎస్పీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారు. గౌరి గంజ్ నుంచి గెలిచిన రాకేష్ ప్రతాప్ సింగ్, గోసయ్‌గంజ్ నుంచి గెలిచిన అభయ్ సింగ్, కల్పి నుంచి గెలిచిన వినోద్ చతుర్వేది బీజేపీలో చేరారు. ఈ ముగ్గురు ఇప్పటికే ఎస్పీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారు. 2024లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో వీరు ఎస్పీ జారీ చేసిన విప్‌కు వ్యతిరేకంగా బీజేపీఅభ్యర్థికి ఓటు వేశారు. 2027లో ఉత్తర ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎస్పీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడం అఖిలేష్ యాదవ్‌కు భారీ ఎదురుదెబ్బగానే పరిగణించాలి.

పార్టీ మారిన ముగ్గురూ ఎస్పీకి అత్యంత కీలకమైన నేతలే. మరికొందరు నేతలు కూడా ఎస్పీ నుంచి బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితమే అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ నుంచి కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎస్పీలో చేరబోతున్నట్లు ప్రకటించారు.కానీ, పరిస్థితి చూస్తుంటే మాత్రం ఎస్పీ నుంచి ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేలానే కనిపిస్తోంది. మరోవైపు ఎస్పీ..కాంగ్రెస్‌తో పొత్తు కోసం ప్రయత్నిస్తోంది. కానీ, సీట్ల పంచాయితీ మాత్రం తేలడం లేదు.

రైల్వే ఉద్యోగులకు కేంద్రం పండగ కానుక..

78 రోజుల వేతనం బోనస్!

- కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయానికి ఆమోదం- సుమారు 11.40 లక్షల మంది నాన్-గెజిటెడ్ సిబ్బందికి లబ్ధి- ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 చొప్పున చెల్లింపు

- పనితీరును ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయమన్న రైల్వే శాఖ

న్యూఢిల్లీ,అక్టోబర్,14:దసరా, దీపావళి పండగల సీజన్‌కు ముందు భారతీయ రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైల్వే శాఖలోని నాన్-గెజిటెడ్ ఉద్యోగులకు 78 రోజుల వేతనానికి సమానమైన ఉత్పాదకత ఆధారిత బోనస్ ఇచ్చే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈనిర్ణయంతో దేశవ్యాప్తంగా దాదాపు11.40లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ఈ బోనస్ రైల్వే శాఖలోని గ్రూప్-సి ఉద్యోగులకు వర్తిస్తుంది.

వీరిలోట్రాక్ మెయింటెనర్లు, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు,సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్స్‌మెన్ వంటికీలక సిబ్బంది ఉన్నారు. రైల్వేలలో వీరి పాత్రను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. బోనస్‌ను 78 రోజుల వేతనంగా లెక్కిం చినప్పటికీ, చెల్లింపుల పరిమితుల ప్రకారం ప్రతి ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 మాత్రమే అందుతుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైల్వేల పనితీరును పరిగణనలోకి తీసుకుని ఈబోనస్‌ను ఖరారు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేస్ రికార్డు స్థాయిలో 1,670 మిలియన్‌టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు,సుమారు 741 కోట్ల మంది ప్రయాణికులను వారి గమ్యస్థా



నాలకు చేర్చింది. ఉద్యోగుల అంకితభావం, కృషిని గుర్తించి వారిలో స్ఫూర్తిని నింపేందుకే ఈ బోనస్‌ను అందిస్తున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మెరుగైన పనితీరు కనబరిచేలా సిబ్బందిని ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశమని పేర్కొంది. బోనస్ చెల్లింపుల కోసం అవసరమైన నిధులను ఇప్పటికే కేటాయించినట్లు అధికారులు స్పష్టం చేశారు. పండగల వేళ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రైల్వే ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యాసంగిలో వరి సాగు విస్తీర్ణం

తగ్గే అవకాశం: మంత్రి తుమ్మల



హైదరాబాద్, అక్టోబర్14: రానున్న యాసంగిలో వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ నేపథ్యంలో పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంట వ్యర్థాలను కాల్చకుండా పశుగ్రాసంగా వినియోగించేలా చూడాలని సూచించారు. అవసరమైతే ఖరీఫ్ పశుగ్రాసాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. పశుగ్రాసం అందుబాటులో ఉండేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ వ్యవసాయంలో ఏఐ, శాటిలైట్ టెక్నాలజీకి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. జర్మనీ ప్రతినిధులతో డిజిటల్ వ్యవసాయ సాంకేతికతపై చర్చలు జరిపినట్లు వివరించారు. శాటిలైట్ డేటాతో నేలలోని పోషకాలలభ్యత అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒకేసారి 70 లక్షల మంది రైతులకు మట్టి పోషకాలపై సమాచారం అందించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిపారు. ప్రతి 12 రోజులకు ఎరువుల వినియోగ ంపై సమగ్ర సమాచారం అందించే అవకాశం ఉందని అన్నారు. అధిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని ఈ సందర్భంగా రైతులకు సూచించారు. సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొత్త సాంకేతికత కచ్చితత్వం, విశ్వసనీయతను శాస్త్రీయంగా పరిశీలించాల్సి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరా వు సూచించారు. నేల ఆరోగ్య పరిరక్షణ, సాగు ఖర్చుల తగ్గింపునకు డిజిటల్ వ్యవసాయం ఉపయోగకరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమీక్షలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, యాంత్రీకరణ, గోదాముల నిర్మాణాలపై సుదీర్ఘంగా చర్చించారు

పోలీస్ అమరవీరుల

త్యాగాలు చిరస్మరణీయం

అక్టోబర్ 21 నుండి 31వరకు నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా పోలీస్సంస్మరణకార్యక్రమాలు- పోలీస్ కమిషనర్ వెల్లడి- విద్యార్థిని విద్యార్థినులకు వ్యాసరచన , షార్ట్ ఫిలిం మరియు ఫోటోగ్రఫీ పోటీలు



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 14(డీకే చాటింపు): నిజామాబాద్ పోలీస్ సిబ్బంది తమ అమూల్యమైన ప్రాణాలను విధి నిర్వహణలో భాగంగా త్యాగం చేయడం జరిగిందని , వారి త్యాగం వలనే నేడు శాంతియుత వాతవరణం నెలకొన్నదని ప్రజలు కూడా శాంతి యుతంగా ఉంటున్నారని , వారి త్యాగలను గుర్తు చేసుకోవడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర డి.జి.పి ఆదేశాల మెరకు తేది 21-10-2026 నుండి 31-10-2026 వరకు నిజామాబాద్ కమిషనరేటు పరేడ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు.నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ ల పరిధిలలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో ఈ దిగువ తెలియజేయబడిన తేదీల ప్రకారము కార్యక్రమాల నిర్వహణ నిర్వహించడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలియజేయడం జరిగింది.

1) తేది: 20-10-2026 నాడు జనరద్దీ గల ప్రదేశాలలో, ఆర్.టి.సి బస్టాండ్లలో, రైల్వే స్టేషన్స్ యందు బ్యానర్స్ , హోర్డింగ్స్ , పోస్టర్ లు ఏర్పాటు చేయడం

2) తేది: 21-10-2026 నాడు అమరవీరుల దినోత్సవ కార్యక్రమం పోలీస్ హెడ్ క్వార్టర్స్ యందు ఉదయం 8 గంటలకు నిర్వహణ

3) తేది: 22-10-2026 నాడు అమరవీరుల కుటుంబాలను పరమర్శించడం నిజామాబాద్ డివిజన్ లో మాత్రశే ఉంటుందన్నారు.

4) తేది : 23-10-2026 నాడు షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలుపోలీస్ అమరవీరుల త్యాగాలు , పోలీసుల విధులు , ప్రతిభ , ప్రజల రక్షణ వంటి అంశాలపై యువత , ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు షార్ట్ ఫిల్మ్ , ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొనేవారు మూడు ఫోటోలు , మూడు నిమిషాలకు మించని షార్ట్ ఫిల్మ్‌ను సమర్పించాలి. ఫోటోలు 10ఐ8 అంగుళాల పరిమాణంలో ఉండాలి. షార్ట్ ఫిల్మ్‌ను పూర్తి వివరాలతో పెన్‌డ్రైవ్‌లో అందజేయాలి. జిల్లాస్థాయిలో ఎంపికైన మూడు ఉత్తమ షార్ట్ ఫిల్మ్‌లు , ఫోటోలను రాష్ట్రస్థాయి పోటీలకు డీజీపీ కార్యాలయం , హైదరాబాద్‌కు పంపించనున్నారు. ఆసక్తి గల వారు తమ ఎంట్రీలను అక్టోబర్ 23వ తేదీ సాయంత్రంలోగా పోలీస్ పి.ఆర్.ఓ గారికి అందజేయాలి.

5) తేది: 24-10-2026 నాడు ఆర్మూర్ , బోధన్ డివిజన్ ల లోఅమరవీరుల కుటుంబాల ను పరామర్శిస్తామన్నారు.

6) తేది:25-10-2026 నాడు సైకిల్ ర్యాలీ మరియు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ (డిచ్ పల్లి నుండి పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు)

7) తేది: 26-10-2026 నాడు వ్యాస రచన పోటీలు
(తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూలో)
క్యాటగిరి 1 లో కానిస్టేబుల్ నుండి ఎ.ఎస్.ఐ వరకు
ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలి.

2) ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుండి ఎ టువంటి సేవలను ఆశిస్తారు
క్యాటగిరి 2 లో ఎస్.ఐ నుండి ఆ పై స్థాయి వరకు
ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలి.

1) పౌరుల మన్ననలు పొందడానికి పోలీసులు చేయవలసిన కృషి

8) తేది: 27-10-2026 నాడు నిజామాబాద్ డివిజన్ లో కొన్ని కాల నీలలో , కొన్ని గ్రామాలలో ప్రజలకు ఎమి అవసరమో వాటిని గుర్తించడం

9) తేది: 28-10-2026 నాడు ఆర్మూర్ మరియు బోధన్ డివిజన్ లో కొన్ని కాలనీలలో, కొన్ని గ్రామాలలో ప్రజలకు ఎమి అవసరమో వాటిని గుర్తించడంతేది : 28-10-2026 నాడు 12వ తరగతి వరకు చదుతున్న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు (తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ లో)
ఎ) విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఆన్లైన్ లో

1) సైబర్ నేరాల నివారణలో పోలీస్ - పౌరుల యొక్క పాత్ర 2) డ్రగ్స్ నిర్వహణ నివారణలో పోలీస్ పాత్ర మరియు విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు.బి) డిగ్రీ మరియు ఉన్నత విద్య అభ్యసిస్తున్నటువంటి విద్యార్థులకు ఈ దిగువ తెలుపబడిన అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నారు.

1) సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీస్ పాత్ర
2) తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రం గా తీర్చిదిద్దడంలో నా పాత్ర10) తేది: 29-10-2026 నాడు పోలీస్ హెడ్ క్వార్టర్స్ యందు రక్తదాన శిబిరం కార్యక్రమం11) తేది: 30-10-2026 నాడు ఆన్లైన్ ద్వారా ఓపెన్ హౌజ్ కార్యక్రమాలు నిర్వహణ

12) తేది: 31-10-2026 నాడు గాంధీ చౌక్ నుండి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకుక్యాండిల్ ర్యాలీ కార్యక్రమంఉంటుందన్నారు.

టీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా

కంతి మోహన్ రెడ్డి నియామకం



జగిత్యాల, అక్టోబర్14,(డీకే చాటింపు): తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కంతి మోహన్ రెడ్డి నియమితులయ్యారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో 2026--28 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ అభివృద్ధికి గత కొన్ని సంవత్సరాలుగా మోహన్ రెడ్డి చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు కోదండరాం తెలిపారు.

రాష్ట్రస్థాయిలో ఆయన సేవలను వినియోగించుకుంటామని పేర్కొన్నారు.

కార్యకర్త నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరకు

కంతి మోహన్ రెడ్డి 2018లో అప్పటి టీఆర్ఎస్‌ను వీడి తెలంగాణ జన సమితిలో చేరారు. ఆయన సేవలను గుర్తించిన ప్రొఫెసర్ కోదండరాం కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్టీ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్--టీజేఎస్ పొత్తులో భాగంగా కోరుట్ల నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. 2024లో పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఆయనకు తాజాగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు.

న్యాయవాదిగా, ప్రజాప్రతినిధిగా రాజకీయ ప్రస్థానం

ఇబ్రహీంపట్నంలో జన్మించిన మోహన్ రెడ్డి 1997లో న్యాయవిద్య పూర్తి చేసి మెట్‌పల్లి కోర్టులో న్యాయవాదిగా వృత్తి ప్రారంభించారు. మెట్‌పల్లి బార్ అసోసియేషన్ కార్యదర్శి, ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. నాలుగుసార్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.18 ఏళ్ల వయసులో యూత్ కాంగ్రెస్‌లో చేరిన ఆయన, 21 ఏళ్లకే సింగిల్ విండో ఎన్నికల్లో పోటీ చేసి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. 2001లో ఇబ్రహీంపట్నం ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఒక్క ఓటు తేడాతో ఓడిపోయారు. అదే ఏడాది ఇబ్రహీంపట్నం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి పోటీ చేసి 23 ఓట్ల తేడాతో పరాజయం పొందారు. 2006లో ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ ఎన్నికల్లో 211 ఓట్ల తేడాతో ఓడిపోయారు. అనంతరం అదే ఏడాది సర్పంచ్‌గా ఎన్నికై 2011 వరకు గ్రామానికి సేవలందించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర 2008 నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న మోహన్ రెడ్డి ఉద్యమ సమయంలో పలు పోలీసు కేసులను ఎదుర్కొన్నారు. అనంతరం టీఆర్ఎస్‌లో చేరి పనిచేశారు. పార్టీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుతో విభేదాల నేపథ్యంలో 2018లో ప్రొఫెసర్ కోదండరాం సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై తెలంగాణ జన సమితిలో చేరారు. పార్టీలో వివిధ స్థాయుల్లో బాధ్యతలు నిర్వహించిన ఆయనకు తాజాగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి దక్కింది. ఈ నియామకంతో పార్టీ రాష్ట్రస్థాయి కార్యకలాపాల్లో ఆయన మరింత కీలక పాత్ర పోషించనున్నారు.

కరెంట్ కోతలు లో ఓల్టేజ్ తో రైతుల ఇక్కట్లు

బిజెపి ఆధ్వర్యంలో రాస్తారోకో





ఆర్మూర్ విలేఖరి అక్టోబర్ 14 (డీకే చాటింపు): కరెంట్ కోతలు లో ఓల్టేజ్ తో రైతుల ఇక్కట్లు పడుతున్నా రని పంటలు చేతికి అందే సమయంలో లో ఓల్టేజ్ సమస్య ,అప్రకటిత కోతలతో మోటర్లు కాలిపోతున్నాయని కిసాన్ మార్చ ఆధ్వర్యంలో ఆర్మూర్ కెనాల్ కట్ట వద్ద బుధవారం రాస్తా రోకో చేశారు.24 గంటల హామీ ఏమైందని ప్రభుత్వం పై నిరసనగా భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆర్మూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో రైతాంగానికి 24 గంటలు కరెంటు ఇస్తామని చెప్పి ఇస్తానన్న కరెంటు ఇవ్వకపోవడం వల్ల లో వోల్టేజీ కారణంగా మోటార్ కాలిపోతున్నందున ఆర్మూర్ లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కెనాల్ పై రాస్తారోకో చేయడం జరిగింది. ఈ యొక్క రాస్తా రోకో భారతీయ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిపారు. కరెంట్ కోతలు లో ఓల్టేజ్ తో రైతుల ఇక్కట్లు పడుతుంటే రైతాంగం గురించి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రుల నిర్లక్ష్యం కారణంగా చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయి అని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నూతుల శ్రీనివాస్ రెడ్డిఅన్నారు. లో వోల్టేజ్ కారణంగా మోటర్లు కాలిపోతూ ఉన్నాయి ఒక్కొక్క మోటర్కు పది నుంచి 12 వేల రూపాయలు ఖర్చవుతున్న రైతులు అప్పులు తీసుకొచ్చి పెడుతూ కరెంటు ఇస్తే పండుతాయని విశ్వాసంతో రైతులు తమ పంట పొలాలవద్దే ఉండి నీరు అందిస్తామన్నారు. కరెంటు సరియైన సమయానికి రాక ఐదు నుంచి 8 గంటలకంటే మించి ఇవ్వక పోవడం వల్ల ఈ రాష్ట్రంలో రైతాంగం ఆత్మహత్య లు చేసుకునే పరిస్థితికి ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఉసిగొల్పాతా ఉంది . రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని పంటనష్టపోయిన రైతులకు 50 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని రైతాంగానికి నాణ్యమైన టువంటి విద్యుత్ అందించాలని ఈ రాష్ట్రంలో ఫసల్ బీమా యోజనాన్ని వెంటనే అమలు చేయాలని ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నూతుల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ ఏడిఇ వచ్చి రైతాంగానికి ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పడంతో రాస్తారోకో విరమించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కే.గంగాధర్ ఆర్మూర్ పట్టణ అధ్యక్షులు శేషగిరి లింగం బీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వివేకనంద.చిట్టి భజన, పుల్కం వేణు ,యాదాద్రి భాస్కర్ ,రాజు ,ఈశ్వర్ ,శ్రావణ్ పోచంపాడు శ్రీనివాస్ కలిగుట ప్రశాంత్ ఉదయ గౌడ.తోటనారాయణ,మరియు రైతులు పాల్గొన్నారు.

టీజీఓ బతుకమ్మ సంబురాలకు మంత్రి సీతక్కకు ఆహ్వానం



హైదరాబాద్, అక్టోబర్ 14, డీకే చాటింపు:- టీజీఓ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 2026 బతుకమ్మ సంబురాలకు హాజరు కావాల్సిందిగా రాష్ట్ర మంత్రి సీతక్కను టీజీఓ సెంట్రల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆహ్వానించారు. టీజీఓ మహిళా విభాగం చైర్‌పర్సన్ దీపారెడ్డి, కన్వీనర్ సుజాత, హైదరాబాద్ జిల్లా ంహా అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణ యాదవ్, మహిళా విభాగం కోశాధికారి శాంతిశ్రీ తదితరులు ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ కార్యాలయంలో మంత్రి సీతక్క ను కలిసి, బతుకమ్మ సంబురాలకు హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి సీతక్క 2026 బతుకమ్మ సంబురాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం దానకిశోర్ ఐ ఏ ఎస్., ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా), తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ రమణ నాయక్ టీజీఓ ఇంజినీర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస్, ఇంజినీర్ సిద్ధార్థ్‌తో పాటు పంచాయతీరాజ్ శాఖకు చెందిన పలువురు ఇంజినీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం బి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ, రేపు మధ్యాహ్నం 3 గంటలకు నాంపల్లిలోని టీజీఓ భవన్‌లో నిర్వహించనున్న బతుకమ్మ సంబురాలకు మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయం

ఈవోగా గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా...

బెల్లంపల్లి (డీకే చాటింపు) కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, తెలంగాణ హైదరాబాద్ ఉత్తర్వుల ప్రకారం బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామంలో కొలువైన శ్రీ బుగ్గరాజేశ్వర స్వామి దేవాలయము యొక్క కార్యనిర్వహణాధికారిగా గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా నియామకం అయ్యారు. బుధవారం పూర్తి అదనపు బాధ్యతలను జి.బాపురెడ్డి కార్యనిర్వహణాధికారి వద్ద నుండి వేణుగోపాల్ గుప్తా స్వీకరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ బుగ్గ ఆలయాన్ని అభివృద్ధి కీ తన వంతు కృషి చేస్తానని అన్నారు.



12వ బెటాలియన్ ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో

ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలీస్ కమీషనర్



550 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

ఆర్మూర్ విలేఖరి అక్టోబర్ 14(డీకే చాటింపు): 12వ బెటాలియన్ ఎన్‌సీసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్), నిజామాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక శిక్షణ శిబిరంలో క్యాడెట్లను ఉద్దేశించి పోలీస్ కమీషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ , సమయపాలన , బాధ్యతాయుత ప్రవర్తన , నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని , యువత సరైన విలువలతో ఎదిగినప్పుడే సమాజం , దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. యువతలో క్రమశిక్షణ , నాయకత్వ లక్షణాల అభివృద్ధికి ఎన్‌సీసీ దోహదం , ఎన్‌సీసీ శిక్షణ అనేది కేవలం శారీరక దృఢత్వానికి మాత్రమే పరిమితం కాకుండా , యువతలో మానసిక స్థైర్యం , ఆత్మవిశ్వాసం , క్రమశిక్షణ , ఐకమత్యం , నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించే సమగ్ర శిక్షణ కార్యక్రమమని ఈ సందర్భంగా వివరించారు. అక్టోబర్ 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిజామాబాద్‌లోని సీటీసీ (జుజ)లో కొనసాగుతోంది. ఈ శిక్షణ శిబిరంలో మొత్తం 550 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొంటుండగా , వారికి వివిధ అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు.ఈ శిబిరంలో భాగంగా బుధవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బృంద స్ఫూర్తితో పనిచేయడం , కష్టసమయాల్లో ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవడం , ఇతరులకు సహాయపడటం , సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడం వంటి లక్షణాలు ప్రతి విద్యార్థికి అవసరమని సూచించారు. దేశసేవ , సామాజిక బాధ్యతపై అవగాహన ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ సమయంలో నేర్చుకునే క్రమశిక్షణ , సేవాభావం , దేశభక్తి వంటి విలువలను తమ జీవితాల్లో ఆచరణలో పెట్టాలని పోలీస్ కమిషనర్ సూచించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ , ప్రజలకు సహాయం చేయడం , విపత్తుల సమయంలో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం వంటి అంశాల్లో యువత బాధ్యతాయుత పాత్ర పోషించాలని తెలిపారు. విద్యతో పాటు నైతిక విలువలు , సామాజిక స్పృహ కలిగి ఉన్నప్పుడే విద్యార్థులు భవిష్యత్తులో సమర్థవంతమైన పౌరులుగా ఎదగగలరని పేర్కొన్నారు. యువత ఎల్లప్పుడూ డ్రగ్స్ కు దూరంగా ఉండాలని వారి వారి గ్రామాలలో ప్రజలను చైతన్యవంతులను చేయాలని అన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని , ఈ సైబర్ నేరాల పట్ల తమ బంధుమిత్రులను కూడా అప్రమత్తంగా ఉండాలని తెలియజేయాలని తెలిపారు. 550 మంది క్యాడెట్లకు శిక్షణ
అక్టోబర్ 9 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ వార్షిక శిక్షణ శిబిరంలో 550 మంది క్యాడెట్లకు శిక్షణ అందిస్తున్నారనీ 12వ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి విష్ణు పి. నాయర్ తెలిపారు.ఇటువంటి శిబిరాలు యువతలో క్రమశిక్షణతో పాటు దేశసేవ పట్ల నిబద్ధతను పెంపొందించ డానికి, భవిష్యత్తులోసమాజా నికి ఉపయోగపడే బాధ్యతా యుత పౌరులుగా తీర్చిదిద్ద డానికి దోహదపడతాయి అన్నారు.ఈ కార్యక్రమంలో 12వ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి విష్ణు పి. నాయర్ , సుబేదార్ మేజర్ రచ్‌పాల్ సింగ్ , సీటీసీ ఏసీపీ రాజశేఖర్ , బోధన్ ఏసీపీ శ్రీనివాస్ , బోధన్ రూరల్ సి ఆర్ విజయ్ బాబు , సి.టి.సి ఎస్.ఐ వరప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ లీసర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

-నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక... -ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ లీసర్వే... -వెంకటాపూర్‌లో క్షేత్రస్థాయిలో భూ లీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్...



నారాయణపేట,(డీకే చాటింపు): జిల్లాలో చేపడుతున్న భూ రీసర్వే పనులను వేగవంతం చేసి,నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక రెవెన్యూ, సర్వే శాఖ అధికారులను ఆదేశించారు.మరికల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో ప్రత్యేక సర్వే బృందాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను బుధవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు.నూతనంగా ఏర్పాటు చేసిన,శిక్షణ పొందిన సర్వే బృందాల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్లను ఆదేశించారు.రీ సర్వే పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.భూముల కొలతలను కచ్చితత్వంతో చేపట్టి,భూహద్దులను స్పష్టంగా నిర్ధారించేందుకు ఆధునిక రోవర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు.రీసర్వే ద్వారా భూ సరిహద్దుల నిర్ధారణతో పాటు రెవెన్యూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని, భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా నివారించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.వెంకటాపూర్ గ్రామంలో 640 ఎకరాల భూమి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఫౌండేషన్ ప్రకారం రీసర్వే నిర్వహించి,108 మందికి ఫారం-11జారీ చేస్తున్నట్లు తెలిపారు.ఎక్లాస్పూర్ గ్రామంలో 24 మందికి సంబంధించి రీసర్వే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. సర్వే బృందాల్లో పనిచేస్తున్న చైన్‌మెన్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకోగా,ప్రస్తుతం 24 మంది చైన్‌మెన్లు విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.నిర్దేశించిన పనులన్నింటినీ రాబోయే 20 రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.భూ రీసర్వే ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రైతులు, గ్రామస్థులు సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏడీ వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ రామ్‌కోటి, రెవెన్యూ,సర్వే శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
గురువారం,అక్టోబర్,15, 2026

తోలుబొమ్మలాట కనుమరుగేనా..?

సినిమాలు, టి.వి.లు లేని రోజుల్లో వృత్తి కళాకారుల ప్రద ర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలిసిపోయిన పల్లె ప్రజలకు జానపదుల ప్రదర్శనలు సేదతీర్చేవి. గ్రామాల్లో జానపద కళాకారులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఇచ్చేవారు. ముందు తరాలవి శ్రమైక జీవన విధానం. కష్టజీవులే ఎక్కువ మంది. రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరిన వారి అలసట తీర్చి వారికి సాంత్వన చేకూర్చే కళా రూపాలే జనపదాలు. అలాంటి వాటిలో తోలు బొమ్మలాట ప్రధానమైనది. తోలు బొమ్మలాట ఒక జానపద కళారూపం. తాను స్వయంగా అనుకరించలేని జానపదుడు కావ్యాల్లోనూ, పురాణాల్లోను వర్ణింపబడిన పాత్రల ఆహార్య విశేషాలను స్వయంగా సృష్టించు కున్నాడు. తన భాషతో ఆ మూగ చిత్రాలకు ప్రాణం పోశాడు. రకరకాల విన్యాసాలను వాటి చేత చేయించాడు. తాను స్వయంగా వెనుకనుండి ఈ పాత్రలను కదిలించాడు. కదులుతున్న ఆ జీవంలేని బొమ్మలతో జీవ నిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడం లోనే జానపదుడి కళాత్మకత దాగి ఉంది. సుసంపన్న మైన హిందూ ఇతిహాసాలను తెర మీదకి తెచ్చిన ఒక గొప్ప ప్రక్రియ తోలు బొమ్మలాట.ఒక సామూహిక సంగీత, నాట్య ప్రదర్శన కళారూపమైన తోలు బొమ్మలాట, జానపదుని మొదటి రంగస్థల ప్రదర్శన కళారూపాన్ని గుర్తించవచ్చు. పూర్వం రాజాస్థానాల లోని పండితులు తమ ప్రభువులను సంతోష పెట్టడానికి బొమ్మలను తయారు చేసి మానవులుగా నటింపచేస్తే సృజనాత్మకంగా ఉంటుందని భావించి తోలు బొమ్మలను తయారుచేసి, తెల్లటి పంచెను తెరగా అమర్చి, దానిపైన దీపం కాంతిలో బొమ్మల నీడలను పడేటట్లు చేసి బొమ్మలాటను ప్రదర్శించేవారు. ఈ విధంగా తోలు బొమ్మలాట పుట్టిందని, ఈ ఆట పండితుల చేత మెరుగులు దిద్దుకున్నదని, చెప్పడానికి అమర కోశం లోని శ్లోకాలను నిదర్శనంగా పేర్కొనవచ్చు. మహా భారతంలో తోలు బొమ్మలాట ప్రస్తావన ఉంది. భగవద్గీతలో సత్త్వ, తమో, రజో గుణాలు మూడు దారాలని, అవి పరమాత్ముని చేత మానవ జీవన గమనంలో లాగబడుతుంటాయని చెప్పబడింది. మానవుడు బొమ్మ అయితే అతనికున్న సూత్రాలు ఈ మూడు గుణాలు. ఆడించేవాడు జగన్నాటక సూత్రధారి అన్న అర్థంలో ఉన్న ఈ భాగం తోలు బొమ్మలాటలకు సంబంధించిన ప్రస్తావన. భారతీయ జానపద ప్రదర్శన కళల్లో అతి ప్రాచీనమైన దృశ్య రూపకానికి చెందినది తోలు బొమ్మలాట. క్రీ.పూ 3 వ శతాబ్దం నాటికే తెలుగు దేశంలో తోలు బొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. చరిత్రకారుల ప్రకారం తోలు బొమ్మలు క్రీ.పూ 2500 సం.నకు పూర్వం, పురాతన నాగరికత అయిన హరప్పా, మొహంజోదారో కొన్ని వేల కిలోమీటర్ల వరకూ వ్యాపించినట్లు చెపుతారు. క్రీ.పూ 3 వ శతాబ్దానికి చెందిన అశోకుని శిలా శాసనాల్లో జంబూ ద్వీపానికి బొమ్మలాట ప్రదర్శన రంగంగా ఆపాదించారు. పతంజలి మహాభాష్యంలో తన కాలపు వినోద సాధనాలను వివరిస్తూ మూడు ప్రధానమైన వాహికలను వివరిస్తూ వాటిలో బొమ్మలాట ఒక ప్రధనమైన వాహిక అని వివరించారు. తేరి గాథ అను బౌద్ధ గ్రంథంలో బొమ్మలాటకు సంబంధించిన ప్రస్తావన ఉంది. వాత్సాయనుని కామసూత్రాల్లో బొమ్మలలోని రకాలు, బొమ్మలాటల్లోని తేడాలు చర్చింప బడినాయి. కన్యలను ఆకర్షించడానికి బొమ్మలాటల ప్రదర్శన అవసరమని వాత్సాయనుని వివరణ. నాటకానికి, తరువాత పరోక్షంగా తోలుబొమ్మలాట సినిమాకు మూలమైంది. కదలికలోని ఆనందం కనుక్కున్న మనిషి ఆలోచనలో నుండి పుట్టిందే బొమ్మలాట. స్థిరత్వం నుండి చలనం వైపుకు పయనించడంలో భాగంగా ప్రాచీన మానవుడు బొమ్మలాటను సృష్టించు కున్నాడు. కథ చెప్పడం మొదలైన తరువాత ఆ కథలోని పాత్రలు తెరమీద కనిపిస్తే, నటిస్తే చూడాలన్న జనపదుడి తపనలో నుండి బొమ్మలాట పుట్టింది. బొమ్మలతో ఆడుకోవడం అతి ప్రాచీన కళ. కొయ్యబొమ్మ లాటలు, కట్టెబొమ్మ లాటలు, తొడుగు బొమ్మలాటలు, తళ్ళబొమ్మ లాటలు, బుట్టబొమ్మ లాటలు, తోలుబొమ్మ లాటలు అని బొమ్మలాటలు అనేకము ఉన్నాయి. రంగస్థలంపై పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని లేదా పంచెను ముందు భాగంలో గట్టిగా లాగి కడతారు. తెర భూమి నుండి నిలువుగా ఉండకుండా కొంచెం ఏటవాలుగా కడతారు. ఈ విధంగా కట్టడం వల్ల బొమ్మలను ఆడించే టప్పుడు బొమ్మలకు కాళ్ళు అడ్డు తగలకుండా ఉంటుంది. తోలు బొమ్మల ప్రతిబింబాలు సరిగ్గా తెరపై పడడానికి తెరలోపలి నుండి పూర్వం కాగడాలు ఉపయోగించేవారు. విద్యుత్ సౌకర్యం అభివృద్ధి చెందిన తర్వాత ఎక్కువ కాంతిని ఇచ్చే విద్యుత్ బల్బులను వాడుతున్నారు.



ఆస్ట్రేలియాలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు
బతుకమ్మ వేడుకలలో ఆస్ట్రేలియా మంత్రులు






నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 14, (డీకే చాటింపు): ఆస్ట్రేలియాలో తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు, తెలుగు అసోసియేషన్ ఖ్యాతి తెస్తున్నారు.ఆస్ట్రేలియా దేశంలోని కంగారులకు నిలయమైన,సౌత్ ఆస్ట్రేలియా రాష్ట్రం రాజధాని అడిలైడ్ లో , ఉత్సాహవంతు లైన తెలుగువారిని ఏకం చేస్తూ అడిలైడ్ తెలంగాణ అసోసియేషన్ (ఆటా)2016 లో స్థాపించారు. వ్యవస్థాపకులైన యారా ఆదిరెడ్డి వరంగల్ జిల్లాకు చెందినవారు.ప్రస్తుత అధ్యక్షులు రాజయకుమార్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లా వాసులు. ఈసీ మెంబర్లు సందీప్ ,సతీష్,సామ్రాట్(నిజామాబాద్)చెందినవారు.మిగతా సభ్యులు కరీంనగర్,ఖమ్మం, హైదరాబాద్,మెదక్,రంగారెడ్డి,నల్గొండ మహబూబ్ నగర్ జిల్లాలకుచెందినవారు.ఆయా జిల్లాల కుటుంబ సభ్యులతో కలిసి సభ్యత్వం తీసుకొని కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు .తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, భారత స్వాతంత్ర్యదినోత్సవం,బోనాలు వేడుకలు,వన భోజన కార్యక్రమాలు, గణపతి నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ సంబరాలు,దసరా సమ్మేళనం, దీపావళి మహోత్సవం, భారత భారత గణతంత్ర దినోత్సవం జరుపుతున్నారు. పేదవారికి ఆర్థిక సహకారం, సేవ చేయడం, ఆస్ట్రేలియా ఆవిర్భావ దినోత్సవం.ఉగాది వేడుకలు, వివిధ రకాల ఆటల పోటీలు, టోర్నమెంట్ నిర్వహించడం, సభ్యులు కార్యవర్గము కృషితో, దాతల సహకారంతో, సమిష్టి కృషితో నిర్వహిస్తున్నారు.ప్రధానంగా కొన్ని కార్యక్రమాలకు ఆస్ట్రేలియా పార్లమెంట్ మల్టీకల్చరల్ అఫైర్స్ మినిస్ట్రీ ద్వారా గుర్తింపు పొంది, ఆర్థిక సహకారం పొందుచున్నారు. వేడుకల నిర్వహణలో భాగంగా ఇతరసంస్థలవారిని స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తూ కార్యక్రమాలు అత్యంతవైభవంగానిర్వహిస్తు న్నారు.తెలుగువారి గౌరవాన్ని చాటే విధంగా కృషి చేస్తున్న వీరిని అభినందించక తప్పదు.ఈ సంస్థ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కంటే ముందే 2010 సంవత్సరం నుండి బతుకమ్మ సంబరాలను అత్యంత వైభవంగా, అందరి మన్ననలు పొందుతూ నిర్వహిస్తూ ఉండడం ఒక విశేషం.ఈసారి పార్లమెంట్ సెంట్రల్ హాల్లో మంగళవారం,సాయంత్రం, బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆట కార్యవర్గం,సభ్యులు,అతిథులు పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకల్లో మంత్రులు వేడుకలకు ముఖ్య అతిథులు,ప్రత్యేక ఆహ్వానితులుగా ఆస్ట్రేలియా ప్రభుత్వం తరపున నడియా క్లాన్సి మినిస్టర్ ఫర్ మల్టీకల్చరల్ అఫైర్స్,మైకేల్ లెన్ సింక్ షాడో మినిస్టర్ ఫర్ మల్టీకల్చరల్ అఫైర్స్,ఎంపీ జాన్ ఫుల్ బ్రతు, కత్రినే హెలియోడ్ మినిస్టర్ ఫర్ హ్యూమన్ సర్వీసెస్, అలిస్ రోల్స్ మినిస్టర్ ఫర్ చైల్డ్ ప్రొటెక్షన్, క్లారే స్క్రీవెన్ మినిస్టర్ ఫర్ ప్రైమరీ ఇండస్ట్రీస్, ఎంపీ జాన్ స్టీన్ సన్, ఎంపీ మీ గన్ స్పెన్సర్స్ మరియు ఎంపీ సారా ఆన్ డ్రీవ్స్ , తదితరులు హాజరై కార్యక్రమంలో పాల్గొని అభినందించారు.మహిళా ప్రతినిధులు బతుకమ్మ ఆడారు.ఆస్ట్రేలియా ప్రభుత్వ ప్రతినిధులుహాజరయ్యారు.స్వయంగా బతుకమ్మ పాటలు, ఆటలలో పాల్గొని ఆనందించి ,మన పండగ గురించి తెలుసుకొని అభినందించారు.వారిని అడల్ట్ తెలంగాణ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు రాజకుమార్ రెడ్డి, అధ్యక్షులు ప్రత్యూష కట్ట, ఉపాధ్యక్షురాలు సుమంత్ గుబ్బ కార్యదర్శి జోష్ణ కొన్నింటి,కోశాధికారి అనిల్ పగడాల,పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీరామ్ ఆకుల జగన్, సెక్రటరీ రేవంత్ గుప్త, న్యూ మైగ్రేట్ కో-ఆర్డినేటర్ నిఖిల్ తాళ్లూరి,కమ్యూనిటీ రిలేషన్ ఆఫీసర్ మౌనిక అంది మహిళా కోఆర్డినేటర్ ప్రశాంత్ రెడ్డి జూలకంటి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నితీష్ రెడ్డి కుడుముల, స్టూడెంట్ కో-ఆర్డినేటర్ కోర్ కమిటీ సభ్యులైన ఆదిరెడ్డి,ఫౌండర్ పబ్లిక్ ఆఫీసర్ మమతా దేవా,పూర్వ అధ్యక్షురాలు హరిత రెడ్డి, చైర్పర్సన్ సభ్యులు చరిత్ రెడ్డి, సామ్రాట్ తాటి, మనోహర్ కట్ట వీరితో పాటు సమస్త సభ్యులు కలిసి అతిథులకు సాధర స్వాగతం పలికి ఘనంగా సన్మానించినారు. కార్యక్రమంలో నిజామాబాద్ నుండి వచ్చిన తాటి లత , వీరేశం అతిథులుగా పాల్గొనే అవకాశం కలిగినందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు.



అసంపూర్తి పనులను
యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలి
ఎంఈఓ లతో సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 14 (డీకే చాటింపు) : కస్తూర్బా గాంధీ విద్యాల యాలతో పాటు జిల్లాలోని ఇతర ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపర్చేందుకు వీలుగా చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. పలు చోట్ల సివిల్ వర్క్స్ మందకొడిగా సాగుతుం డటం పట్ల ఇంజనీరింగ్ విభాగం అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో మంగళవారం మండల స్పెషల్ ఆఫీసర్లతో, ఎంఈఓ లతో కలెక్టర్ సమీక్ష జరిపారు. కేజీబీవి పాఠశాలల్లో నూతన భవన నిర్మాణాలు, అదనపు తరగతి గదులు, మరుగు దొడ్లు, డ్రైనేజీల నిర్మాణ ప్రగతిని సమీక్షిస్తూ, పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు మంజూరీలు లభించని పక్షంలో వీబీ జీరాంజీ కింద ప్రతిపాద నలు పంపాలని అన్నారు. ఎం.ఎస్.ఓ లు, ఎం.ఈ.ఓ.లు ప్రతీ నెల కనీసం రెండు పర్యాయాలు కేజీబీవీలను ఆకస్మికంగా సందర్శిస్తూ నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించా లని కలెక్టర్ సూచించారు. బాలికలకు పరిశు భ్రమైన నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యా సంస్థల పరిసరాలు, ఆవరణ పరిశుభ్రంగా ఉండాల న్నారు. ముఖ గుర్తింపు విధానం (ఎఫ్.ఆర్.ఎస్) నూటికి నూరు శాతం అమలు చేయాలని, లేనిపక్షంలో జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. అస్తవ్యస్త పరిస్థితుల కారణంగా ఏదైనా విద్యా సంస్థలో అతిసారం, డెంగీ, మలేరియా వంటి కేసులు నమోదు అయితే సంబంధిత మండల విద్యా శాఖ అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. ఆయా బడులలో మౌలిక సదుపాయాల పనులతో పాటు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణాల ప్రగతిని, నాణ్యతను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలని మండల ప్రత్యేక అధికారులకు, ఎం ఈ ఓ లకు సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇంచార్జి జిల్లా విద్యా శాఖ అధికారి సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వల్మిడి సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి శంఖు చక్రదీపాల బహుకరణ



జనగామ/పాలకుర్తి అక్టోబర్ 14 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి జెడ్పీహెచ్ఎస్ పాలకుర్తి పాఠశాలలో 1990--91 ఎస్ఎస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శంఖు,చక్ర దీపాలను భక్తిశ్రద్ధలతో బహుకరించారు. బుధవారం ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ వెంకటరెడ్డి, ఆలయ అర్చకులు చక్రవర్తుల కళ్యాణ సుందరాచార్యులు పూర్వ విద్యార్థుల సేవాభావాన్ని అభినందించారు. స్వామివారి ఆలయానికి దీపాలను బహుకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆలయ ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు భక్తులు, పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో దేవస్థానం ఈఓ వెంకటరెడ్డి, ఆలయ అర్చకులు చక్రవర్తుల కళ్యాణ సుందరాచార్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల పనులను
నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలి
కందకుర్తి, యంచ పుష్కర ఘాట్ల వద్ద పనులను పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్ప్రతినిధి, అక్టోబర్14(డీకే చాటింపు): గోదావరి పుష్కరాల పనులను నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది జూన్, జూలై మాసాలలో జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా పుణ్య స్నానాల కోసం పుష్కర క్షేత్రాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, నిర్ణీత కాల వ్యవధిలో అన్ని పనులు పూర్తయ్యేలా చూడాలని, నాణ్యతతో పనులు జరిగేలా క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేయాలని అన్నారు. గోదావరి, మంజీర, హరిద్ర నదుల కలయికతో త్రివేణి సంగమ ప్రాంతంగా భాసిల్లుతున్న రెంజల్ మండలం కందకుర్తి వద్ద గల పుష్కర ఘాట్ తో పాటు, నవీపేట మండలం యంచ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న పుష్కర ఘాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి సందర్శించారు. కందకుర్తి వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పుష్కర ఘాట్ నిర్మాణం, ఆలయ అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే గోదావరిలో నీటి ప్రవాహం కారణంగా ఇరిగేషన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనుల విషయంలో కొంత జాప్యం జరుగుతోందని సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే పనులను వేగవంతంగా చేపట్టి, మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల ప్రగతిని వారానికి కనీసం రెండు పర్యాయాలు పర్యవేక్షణ చేయాలని ఆర్డీఓ, తహసీల్దార్లకు సూచించారు. అప్రోచ్ రోడ్లు, కల్వర్టుల ఏర్పాటు వంటి పనులను ఏకకాలంలో సమాంతరంగా చేపట్టేలా చూడాలన్నారు. అభివృద్ధి,మౌలికసదుపాయా ల కల్పన పనులు కొనసాగు తున్న దృష్ట్యా, పుష్కర ఘాట్ల వద్ద పోలీస్ పెట్రోలింగ్ తో పాటుగ్రామపాలనఅధికారులు ,లష్కర్ లు నిరంతరం సందర్శిస్తూ నిఘా ఉంచాలన్నారు. పనులను చేపట్టే విషయంలో ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే తమ దృష్టికి తేవాలన్నారు. యంచ వద్ద చేపట్టనున్న పుష్కర ఘాట్, పార్కింగ్ ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. భక్తులకు రవాణా వసతి, పార్కింగ్, టాయిలెట్స్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, దుస్తులు మార్చుకునే గదులు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. పిండ ప్రదానం, కేశఖండనంనిర్వహించుకునేందుకు వీలుగా షెడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు.భక్తులకు అన్ని సదుపాయాలు అందు బాటులో ఉండేలా, భద్రతతో కూడిన ఆధ్యాత్మిక వాతా వరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, తహసీల్దార్లు శ్రవణ్, వెంకట రమణ, దేవాదాయ, పంచాయతీరాజ్, నీటి పారుదల తదితర శాఖల అధికారులు ఉన్నారు.

జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా ఎన్. ప్రసూనాంబ బాధ్యతల స్వీకరణ



జగిత్యాల, అక్టోబర్14,(డీకే చాటింపు):జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా ఎన్. ప్రసూనాంబ బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో బాధ్యతలు స్వీకరించారు.సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమించారు. గతంలో ఆమె తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీ పై జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులై నేడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కే.వై. ప్రసాద్ కలెక్టరేట్ ఏవో కిషన్ మరియు కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



ఆధునిక యంత్రాలను

ప్రారంభించిన మున్సిపల్ చైర్పర్సన్

-నారాయణపేట మున్సిపాలిటీలో అందుబాటులోకి వచ్చినహైడ్రాలిక్ స్లైలిస్ట్ నిచ్చెన యంత్రం,స్వీపింగ్ మిషన్... -పాల్గొన్న వైస్ చైర్మన్,తోటి కౌన్సిలర్లు,అధికార పార్టీ నేతలు...



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మున్సిపాలిటీ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసింది.ఈ మంజూరైన నిధులతో రూ.35 లక్షల వ్యయంతో హైడ్రాలిక్ స్లైలిఫ్ట్ నిచ్చెన యంత్రం,(మున్సిపాలిటీలో వీధి దీపాల నిర్వహణకు)రూ.45 లక్షల వ్యయంతో ఖరీదు చేసిన స్వీపింగ్ మిషన్ లను స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్య యాదవ్ తోటి కౌన్సిలర్లు, అధికార పార్టీ నేతలు, మున్సిపల్ అధికారులతో కలిసి బుధవారం మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మంజుల జి.ఆర్.రెడ్డి,వార్డు కౌన్సిలర్లు,డిసిసి మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి,మునిసిపల్ కమిషనర్ ఎన్.శంకర్, మున్సిపల్ మేనేజర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే 18వ,వార్డులో మూల హనుమాన్ మందిరం నుంచి సాగర్ ఇంటి వరకు నిర్మించే సిసి రోడ్డు పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ భూమి పూజ నిర్వహించారు. నారాయణపేట మునిసిపాలిటీకి టి యు ఎఫ్ ఐ డి సి నుంచి మంజూరైన రూ.4 కోట్ల నిధులతో సి.సి. రోడ్డును నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఇక ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తా...

కెసిఆర్‌ను సిఎం చేయడమే లక్ష్యం...

బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు రేణికుంట్ల ప్రవీణ్...



బెల్లంపల్లి (డీకే చాటింపు)తాను ఇక ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుంటానని, ఎస్సి, ఎస్టీ, కమిషన్ మాజీ సభ్యుడు, బీ ఆర్ ఎస్ నాయకులు రేణికుంట్ల ప్రవీణ్ స్పష్టం చేశారు. బుధవారం బెల్లంపల్లి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ కెసిఆర్ ను తెలంగాణ సి ఎం గా చేయడమే తన లక్ష్యమని అన్నారు. పార్టీలోకి కొత్త రక్తం రావాలని అన్నారు. నియోజకవర్గం లోని ప్రజా సమస్యల పరిష్కారానికి క్రియాశీలంగా ముందుంటానని అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కెసిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు తాను ఉద్యమంలోకి వచ్చానని గుర్తు చేశారు. అప్పటి నుండి కెసిఆర్ ఆశీస్సులతో జిల్లా గ్రంధాలయం చైర్మన్ గా, ఎస్సి ఎస్టీ కమిషన్ సభ్యుడి గా అవకాశం వచ్చిందన్నారు.ఇక ప్రత్యక్షంగా రాజకీయాలల్లోకి వస్థానని అన్నారు

పోచారంలో ఇందిరమ్మ ఇండ్ల

టవర్స్‌కు శంకుస్థాపన

పాల్గొన్న మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు



మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా(డీకే చాటింపు): బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొన్ని నియోజకవర్గాలకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పరిమితమైతే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానంగా చూస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఉన్నా ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఉన్నా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడంలో వివక్షకు తావులేదని తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సీఎం రేవంత్ నాయకత్వంలో హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్ల రూపాయలు ఉన్నా పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. నగరంలో జీవనోపాధి పొందుతున్న పేదలను దూర ప్రాంతాలకు తరలించి వారి ఉపాధికి ఇబ్బందులు కలిగించే విధానానికి స్వస్తి పలుకుతున్నామని అన్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే 6 చోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని చెప్పారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని గుర్తించి, అర్హతలను ధ్రువీకరించిన అనంతరం పారదర్శకంగా డ్రా నిర్వహించామని పేర్కొన్నారు. ఎంపికైనవారిలో స్థానికంగా నివసించే అర్హులనే నిర్ధారించి ఇళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. 'రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నాం. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయింది. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరుచేశాం. త్వరలో రెండో విడత ఇందిరమ్మ టవర్స్ కోసం మరోసారి దరఖాస్తులు తీసుకుంటాం. ఇందిరమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి సరిపెట్టబోం. ఎలాంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తాం. ప్రతి అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తాం. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి, వారి చేతుల మీదుగా తాళాలు అందించాలన్నదే మా లక్ష్యం. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో సహా అర్హులందరినీ పరిశీలిస్తాం. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లనూ పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతోపాటు ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తాం. ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు నిబంధనల ప్రకారం కేటాయించాలని అధికారులను ఆదేశించాం. ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ఉన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం సుమారు 440 కోట్ల రూపాయిలు ఖర్చు చేశాం' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ ఎండీ వీపీ గౌతమ్, కలెక్టర్ మనూచౌదరి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో లబ్ధిదారులు స్నేహ, శివకుమారి, రెహ్మాతి తదితరులు మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని, ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపు జరిగింది.

ఎల్ నినో ప్రభావంతో ఎండిన పంటలు

-నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి... -సిపిఎం నారాయణపేట ఏరియా కార్యదర్శి బండమీది బలరాం డిమాండ్... -నారాయణపేట మండలం బొమ్మన్ పాడు గ్రామంలో ఎండిపోయిన పంటల పరిశీలన...



నారాయణపేట,(డీకే చాటింపు): ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో 11 శాతం లోటు వర్షపాతం నమోదైందని,దీనివల్ల రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోయి పెట్టుబడులు కోల్పోయి తీవ్ర ఆందోళనలో ఉన్నారని సిపిఎం నారాయణపేట ఏరియా కార్యదర్శి బండమీది బలరాం ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం నారాయణపేట మండలం బొమ్మన్ పాడు గ్రామ శివారులో ఎండిన టమోటా, వంకాయ తోటలతో పాటు ఇతర పంటలను సిపిఎం బృందంతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండిన పంటలను చూపిస్తూ రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో అన్నదాతలు ఎంతో ఆశతో, అప్పులు చేసి పెట్టిన పెట్టుబడి అంతా మట్టిపాలైందన్నారు.11 శాతం వర్షపాత లోటు కారణంగా సాగునీరు అందక, చేతికొచ్చే దశలో పంటలు కండ్ల ముందే ఎండిపోతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతు న్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఎకరాకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి, ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు.ఎండిపోయిన ఆహార ధాన్యాల పంటలకు ఎకరాకు రూ.25 వేలు చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.తీవ్రంగా నష్టపోయిన వాణిజ్య, కూరగాయల పంటలకు (టమోటా,వంకాయ తదితర తోటలకు)ఎకరాకు రూ.50 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో ఎండిపోయిన పంట పొలాలను సర్వే చేసి నివేదికలు రూపొందించాల న్నారు. అప్పుల ఊబిలో ఉన్న రైతులు అధైర్యపడి ఎలాంటి అఘాయి త్యాలకు పాల్పడకుండా ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి రైతుల్లో భరోసా కల్పించాలి,రైతు భరోసా వెంటనే అందివ్వాలన్నారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో సిపిఎం బొమ్మన్‌పాడు గ్రామ నాయకులు అంతన్ గారి బాల్‌రామ్,కంకప్ప,వెంకటేష్, రాములు, నరసింహ,ఒగ్గు బాలప్ప,బాధిత రైతులు జనార్ధన్,బర్ల నాగప్ప, బస్వరాజ్, దానగాళ్ల నాగప్పలు ఉన్నారు.

ఎర్రవల్లి ఫామ్ హౌస్ సర్వే



హైదరాబాద్, : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూముల వ్యవహారం మరోసారి తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపూర్ పరిధిలోని భూములకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. భూముల సర్వే నంబర్లు, పాత రికార్డులు, ప్రభుత్వ భూములు, పట్టా భూముల వివరాలను సేకరిస్తూ రిపోర్టును తయారు చేసే పనిలో అధికారులు పడ్డారు. కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ భూములపై వాస్తవాలను తేల్చేందుకు విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. బుధవారం రోజున అసెంబ్లీలో అధికారులను ఆదేశించిన నేపథ్యంలో ఈ ప్రక్రియ మొదలైంది. విచారణను 30 రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.ఇందులో భాగంగా మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో పాత ఫైళ్లు, రెవెన్యూ రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఎర్రవల్లి, వెంకటాపూర్, పరిసర గ్రామాలకు సంబంధించిన సర్వే నంబర్లను పరిశీలించి.. ఆయా భూముల స్వరూపం, యాజమాన్య వివరాలు, గత రికార్డులను సేకరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ భూములు, పట్టా భూములకు సంబంధించిన వివరాలను వేర్వేరుగా పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా ఫామ్‌హౌస్ పరిధి, దాని చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డులపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం.ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు సంబంధించి 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందంటూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలోనే మొత్తం ఫామ్‌హౌస్ విస్తీర్ణం ఎంత.. అందులో పట్టా భూమి ఎంత.. ప్రభుత్వ, అసైన్డ్ భూమి ఏ మేరకు ఉంది అనే అంశాలను అధికారులు నిర్ధారించాలని ఆయన ఆదేశించారు. ఫామ్‌హౌస్ మొత్తం విస్తీర్ణంపై కూడా స్పష్టత తీసుకురావాలని సూచించారు.అయితే.. ఈ ఆరోపణలు ప్రస్తుతం అధికారుల విచారణలో ఉన్న అంశాలే కాగా.. 388 ఎకరాల భూమి ఫామ్‌హౌస్‌లో భాగమైందా.. భూముల రికార్డుల్లో ఏవైనా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయా.. అనే విషయాలు విచారణ పూర్తయిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భూముల ప్రస్తుత పరిస్థితితో పాటు గతంలో వాటి పరిస్థితి ఎలా ఉండేదనే విషయాన్ని తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులు టెక్నాలజీని కూడా వినియోగిస్తున్నట్లు సమాచారం. గూగుల్ ఎర్త్ వంటి శాటిలైట్ మ్యాప్‌లలోని పాత చిత్రాలను పరిశీలించి.. గతంలో భూముల వినియోగం ఎలా ఉండేది, ప్రస్తుతం ఏవైనా మార్పులు చోటుచేసుకున్నాయా అనే అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.పాత రెవెన్యూ రికార్డులు, సర్వే నంబర్లు, భూముల ప్రస్తుత స్థితి, శాటిలైట్ చిత్రాలను సమన్వయం చేసి అధికారులు వాస్తవ పరిస్థితిని అంచనా వేయనున్నట్లు సమాచారం. విచారణలో భాగంగా కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని పలు నివేదికలు పేర్కొం టున్నాయి. అయితే నోటీసులు జారీ చేసినట్లు అధికారికంగా నిర్ధారిత సమాచారం వెలువడే వరకు దీనిని ఖరారు చేయడం సరికాదు. అధికారులు రికార్డుల పరిశీలన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.మరోవైపు, భూములపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ నేతలు రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేస్తున్నారు. భూముల వివరాలను అధికారిక రికార్డులు, ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా పరిశీలి ంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఇరు కుటుంబాల ఆస్తులపై న్యాయమూర్తి ఆధ్వర్యంలో విచారణ జరపాలని సవాల్ చేశారు.

కమలంలో కనిపించని అగ్రెసివ్ అప్రోచ్



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయ రంగంలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రత్యేకమైన సవాలును, అదే సమయంలో అపారమైన అవకాశాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు కావాల్సిన సానుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ, ఆ అవకాశాలను ప్రత్యక్ష రాజకీయ ప్రయోజనాలుగా మలచుకోవడంలో బీజేపీ పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ స్థానాలను గెలుచుకుని, 35 శాతం మేర ఓటు షేర్‌ను సాధించి తన ప్రాభవాన్ని చాటుకున్నప్పటికీ, ఆ ఊపును క్షేత్రస్థాయి స్థానిక సంస్థల ఎన్నికలు మరియు నియోజకవర్గ స్థాయిలో నిలబెట్టుకోవడంలో పార్టీ కొంత తడబడుతోంది.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో వ్యక్తమవుతున్న అతిపెద్ద లోపం బలమైన నిలకడైన నాయకత్వం . ఉత్తర తెలంగాణలో పార్టీకి గట్టి పట్టు ఉన్నప్పటికీ, తెలంగాణ వ్యాప్తంగా ఓటర్లను ఆకర్షించగల, సర్వమోదయోగ్యమైన అగ్రనేత కొరత స్పష్టంగా కనిపిస్తోంది. తరచూ మారుతున్న వ్యూహాలు, నాయకత్వ మార్పులు, అంతర్గత విబేధాలు క్యాడర్‌లో గందరగోళాన్ని నింపుతున్నాయి. ప్రజల సమస్యలపై నిలకడగా పోరాటం చేస్తూ, ప్రతీ నియోజకవర్గంలో పార్టీని నడిపించే ఒక పవర్‌ఫుల్ ఫేస్ లేకపోవడం పార్టీ విస్తరణకు ప్రధాన ప్రతిబంధకంగా మారిందిపాక్షికంగా బిఆర్ఎస్ వైఖరి పట్ల సానుభూతి, మెత్తటి వైఖరి అవలంబిస్తుందనే ప్రచారం కూడా బీజేపీకి రాజకీయంగా నష్టం చేకూరుస్తోంది. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై కోపంతో ఉన్న ఓటర్లు లేదా కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి చెందుతున్న ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూడాలంటే.. బీజేపీ స్పష్టమైన ప్రతిపక్ష పాత్రను పోషించాల్సి ఉంటుంది. బిఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతున్న ప్రతిసారీ ఆ పార్టీ స్థానాన్ని ఆక్రమించడంలో వెనకబడితే, ఆ ఓటు బ్యాంక్ మొత్తం తిరిగి కాంగ్రెస్ వైపునకో లేదా స్వతంత్రుల వైపునకో మరలే ప్రమాదం ఉంది.భవిష్యత్తులో బీజేపీ అధికార పీఠానికి చేరువ కావాలంటే, బిఆర్ఎస్ సాంప్రదాయక ఓటు బ్యాంకును కైవసం చేసుకోవడమే ఏకైక మార్గం. ఒకప్పుడు బిఆర్ఎస్‌కు అండగా నిలిచిన గ్రామీణ, వెనుకబడిన వర్గాలు, తటస్థ ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు పక్కా ప్రణాళిక అవసరం. బిఆర్ఎస్ నాయకత్వం రెస్ట్ మోడ్‌లో ఉందనే భావన ప్రజల్లో ఉన్నప్పుడు, ఆ ఖాళీని బీజేపీ తన నిరంతర ప్రజా ఉద్యమాల ద్వారా భర్తీ చేయాలి. కేవలం హిందూత్వ ఎజెండా లేదా పార్లమెంట్ ఎన్నికల నాటి ఇమేజ్‌పైనే ఆధారపడకుండా, స్థానిక సమస్యలపై పోరాటం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ మార్గం అనుకున్నంత సులువు కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కాంగ్రెస్ తన సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయి యంత్రంగంతో బలంగా నిలబడింది. బిఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆకర్షించడంలో కాంగ్రెస్ సైతం తన మార్క్ చూపుతోంది. ఈ త్రికోణ పోటీలో బీజేపీ తన ప్రత్యర్థి కేవలం కాంగ్రెస్ మాత్రమేనని చాటిచెబుతూ, బిఆర్ఎస్ మిగిల్చిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి సమగ్రమైన సంస్థాగత నిర్మాణం చేపడితే తప్ప అనుకున్న లక్ష్యం సాధ్యం కాదు.రాబోయే రెండేళ్ల సమయం తెలంగాణ బీజేపీకి అత్యంత కీలకమైనది.

ఎరక్కపోయి... ఇరుక్కుపోయిన గులాబీ

హైదరాబాద్, : రాజకీయాల్లో ప్రత్యర్థిని ఇరుకున పెట్టేందుకు వేసే ప్రతి వ్యూహం ఆచితూచి ఉండాలి. ఏమాత్రం గురి తప్పినా లేదా మన రికార్డుల్లోనే లోపాలున్నా.. అది కాస్తా రివర్స్ అయి స్వయంకృతాపరాధంగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితి పరిస్థితి అచ్చం చెట్టు కొట్టి నెత్తిన వేసుకున్నట్లే తయారైంది. రిజిస్ట్రేషన్ల శాఖలో నిషేధిత జాబితా అంశాన్ని పట్టుకుని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజల ఆస్తులు ప్రమాదంలో పడ్డాయంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలని బీఆర్ఎస్ అగ్రనాయకత్వం భావించింది. దాదాపు కోటి ఎకరాలకు పైగా భూములు 22ఏ జాబితాలోకి వెళ్లాయని తీవ్రస్థాయి ప్రచారం చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలోకి నెట్టాలని చూసింది.ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని వేసిన ఎత్తుగడ చివరకు తమ మెడకే చుట్టుకున్నట్లయింది గులాబీ పార్టీ పరిస్థితి. సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్ల శాఖలో సెక్షన్ 22ఏ కింద నమోదైన కొన్ని భూముల సమస్యను పట్టుకుని, కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ప్రజావ్యతిరేకతను మూటగట్టాలని బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నం చేసింది. ప్రభుత్వం ప్రజల ఆస్తులను లాక్కుంటోందంటూ క్షేత్రస్థాయిలో భయాందోళనలు సృష్టించేందుకు పార్టీ శ్రేణులు వ్యూహాత్మకంగా ముందుకొచ్చాయి. అయితే, ప్రభుత్వం ఎదురుదాడి చేయకుండా అత్యంత వేగంగా స్పందించడంతో బీఆర్ఎస్ వేసిన తొలి అడుగులోనే పట్టు తప్పింది.సాంకేతిక లోపం వల్ల కొద్దిమంది రైతులు, భూయజమానులకు మాత్రమే ఈ ఇబ్బంది ఎదురైందని గుర్తించిన రేవంత్ రెడ్డి సర్కార్, ఏమాత్రం మొండిపట్టుకు పోకుండా బహిరంగంగా వివరణ ఇచ్చింది. సంబంధిత శాఖ మంత్రి ప్రజలకు అసౌకర్యం కలిగినందుకు చింతిస్తూ, రికార్డులను వెంటనే సరిచేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రోజుల వ్యవధిలోనే సమస్య పరిష్కారం కావడంతో రైతులు, సామాన్యుల్లో ఆందోళన సద్దుమణిగింది. దీంతో ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలన్న ప్రధాన ప్రతిపక్షం వ్యూహం ప్రజల్లో పెద్దగా పనిచేయకుండా పోయింది.

మెన్స్‌క్లబ్ ఫ్యాషన్ ను ప్రారభించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య...



బెల్లంపల్లి(డీకే చాటింపు) పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెన్స్ క్లబ్ ఫ్యాషన్ రెడీమేడ్ వస్త్రాలయాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.మెన్స్ క్లబ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.మెన్స్ క్లబ్ నిర్వాహకులు మహేష్, ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నునేటి సత్యనారాయణ, పట్టణ జనరల్ సెక్రటరీ రెవెల్లి విజయకుమార్, బెల్లంపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, సీనియర్ నాయకులు సుందర్ రావు, బెడ్డల విజయ్,గోలి శివ, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

కీలక నేతలు గుడ్ బై..!

విశాఖపట్టణం: ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కీలక నేతలంతా వరుసగా గుడ్‌బై చెబుతుండటం, మౌనం వహించడంతో అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రంగంలోకి దిగారు. బెంగళూరు నుంచి తాడేపల్లికి తిరిగొచ్చిన జగన్ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాంలను ప్రత్యేకంగా పిలిపించి మాట్లాడారు. పార్టీ వీడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో శ్రేణులకు ధైర్యం చెప్పేందుకు ఈ అత్యవసర భేటీలను నిర్వహించినట్లు తెలుస్తోంది.ఈ భేటీలో ప్రధానంగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు ..పార్టీకి ఒక్క సీటు కూడా రాదని చేసిన ప్రకటనపై చర్చ జరిగింది. సాధారణంగా పార్టీ గీత దాటి మాట్లాడే నేతలను దూరంగా పెట్టే జగన్, ఈసారి మాత్రం విభిన్నమైన వ్యూహాన్ని అమలు చేశారు. వ్యాఖ్యలు ఎలా ఉన్నా, ప్రస్తుతం పార్టీ సీనియర్లను కాపాడుకోవడమే ప్రాధాన్యంగా భావించిన జగన్..పార్టీలో అంతర్గత పోరును పరిష్కరిస్తానని చెప్పకుండా.. ఎవరైనా ఏమనుకున్నా సరే, రాబోయే ఎన్నికల్లో శ్రీకాకుళం లోక్‌సభ ఎంపీ అభ్యర్థిగా నీకే హామీ ఇస్తున్నా అని తమ్మినేనితో నేరుగా చెప్పినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.మరోవైపు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణతోనూ జగన్ విడిగా భేటీ అయ్యారు. విజయనగరం జిల్లా రాజకీయాల్లో బొత్స తీరుపై రకరకాల చర్చలు జరుగుతున్న సమయంలో ఎన్నికల దిశగా పూర్తి స్పష్టత ఇచ్చారు. రాబోయే అసెంబ్లీ పోరులో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న చీపురుపల్లి నియోజకవర్గం నుంచే మళ్లీ పోటీకి సిద్ధమవ్వాలని అధినేత తేల్చిచెప్పినట్లు సమాచారం. నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా క్యాడర్‌ను సమాయత్తం చేసుకోవాలని సూచించారు.అయితే, అధినేత ఆఫర్ చేసిన టికెట్ల హామీలపై ఈ ఇద్దరు సీనియర్ నేతల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. ప్రస్తుతం రీజియన్‌లో ఒకట్రెండు సీట్లు కూడా గెలిచే వాతావరణం కనిపించనప్పుడు, ఇప్పటి నుంచే ఈ సీట్ల ఖరారు వల్ల ప్రయోజనం ఏంటనే నిరాశ వారిలో కనిపిస్తోందని భావిస్తున్నారు. అందుకే ఈ సమావేశం ముగిసిన తర్వాత కూడా బొత్స గానీ, తమ్మినేని గానీ మీడియాతో ఏమీ మాట్లాడలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం విచిత్రమైన రాజకీయ వాతావరణం నెలకొంది. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను నడిపించిన తీరు, నేడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనుసరిస్తున్న వ్యూహాలు పార్టీని మరింత నిరాశలోకి నెడుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో బలమైన నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబంపై చాపరం భూకబ్జా కేసు నమోదు అయింది. . హైకోర్టు వారికి తాత్కాలిక ఊరట నిచ్చింది. అయితే, కూటమి ప్రభుత్వ హయాంలో పోలీసులు కేసులు నమోదు చేసినప్పటికీ అరెస్టు కాకపోవడమే నేరమైనట్లు వైసీపీ అధిష్టానం భావించడం విడ్డూరంగా మారింది. అరెస్టు కాకుండా తప్పించుకున్నారంటే వారు కూటమి ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లేనని, కోవర్టులుగా మారిపోయారనే ముద్ర వేస్తున్నారు.ఈ అనుమానాల రాజకీయం కేవలం తమ్మినేని కుటుంబానికే పరిమితం కాలేదు. గతంలో వైఎస్సార్‌సీపీకి మూలస్తంభంగా ఉండి, ఇటీవలే రాజీనామా చేసి బయటకు వచ్చిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి కూడా సరిగ్గా ఇదే తరహా తీవ్రమైన



ప్రశ్నలను లేవనెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు అందరు కీలక నేతలపై ఏదో ఒక కేసు నమోదు కావడం లేదా అరెస్టులు జరగడం జరుగుతుంటే.. పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డిపై మాత్రం ఎలాంటి కేసులు, అరెస్టులు ఎందుకు నమోదు కావడం లేదని విజయసాయిరెడ్డి నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టానికి అతీతంగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొన్న సజ్జల, ఇప్పుడు కూడా ఎలాంటి చిక్కులు లేకుండా బయటపడటం కోవర్టు రాజకీయమే కాదా అన్న ప్రశ్నను ఆయన అధిష్టానం ముందే ఉంచారు.వైసీపీ అధిష్టానానికి మొదటి నుంచీ ఒక అలవాటు ఉందనే విమర్శలు బలంగా ఉన్నాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రాణపణంగా నిలిచే సీనియర్ నేతలను సైతం.. చిన్నపాటి అనుమానం రాగానే వెన్నుపోటుదారులు గా ముద్రవేసి పక్కన పెట్టేస్తారు. గతంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను వంటి పలువురు సీనియర్లు పార్టీకి దూరం కావడం వెనుక ఈ అధిష్టానం అనుమానాస్పద వైఖరి ప్రధాన పాత్ర పోషించింది. ఇప్పుడు శ్రీకాకుళంలో తమ్మినేని వర్గాన్ని కూడా పార్టీ సమావేశాలకు పిలవకుండా, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి నుంచి తప్పించి రాజకీయంగా ఏకాకిని చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ధోరణి వల్ల సీనియర్లు తమ ఆత్మాభిమానం కోసం ప్రత్యామ్నాయ దారులు చూసుకోవడం అనివార్యమవుతోంది.ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం వైసీపీలో ఉన్న ఈ బలహీనతను పక్కాగా వాడుకుంటోందనే విశ్లేషణలు వస్తున్నాయి. సీనియర్ నాయకులపై కేసులు నమోదు చేయడం , కొంతమంది విషయంలో చట్టపరమైన ప్రక్రియను సాగదీయడం ద్వారా వైసీపీ అధిష్టానంలో గందరగోళాన్ని సృష్టించడంలో కూటమి వ్యూహాత్మకంగా సఫలమవుతోంది. చట్టం తన పని తాను చేసుకుపోతున్నప్పటికీ, ఫలానా నేతను అరెస్టు చేయలేదంటే ఆయన తమతో కుమ్మక్కయ్యాడు అనే సందేశం వైసీపీ క్యాంపులోకి వెళ్లేలా మైండ్ గేమ్ ఆడటంలో అధికార పక్షం పైచేయి సాధిస్తోంది. ఆ ఉచ్చులో పడిన వైసీపీ నేతలు సొంత పార్టీ క్యాడర్‌లోనే అనుమానాల దావానాలాన్ని రగిల్చి నేతలను రోడ్డున పడేస్తున్నారు. అనుమానపు పక్షి కరిచిన చందంగా తయారైన వైసీపీ పరిస్థితి వల్ల దశాబ్దాలుగా పార్టీకి అండగా నిలిచిన క్షేత్రస్థాయి నాయకత్వం పూర్తిగా దెబ్బతింటోంది. ప్రతి చిన్న అంశాన్ని కోవర్టు కోణంలోనే చూస్తే, రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీలో మిగిలేది కొద్దిమంది చుట్టూ ఉన్న కోటరీ మాత్రమే తప్ప, ప్రజాక్షేత్రంలో నిలబడే నాయకులు ఉండరనేది పచ్చి నిజం

సమన్వయం సాధించేది ఎలా

శ్రీకాకుళం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ప్రతిపక్ష పాత్రలో కొనసాగుతోంది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి) నేతృత్వంలో పార్టీ కార్యకలాపాలు సాగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, అంతర్గత విభేదాలు, నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలు రాజకీయ చర్చకు కారణమవుతున్నాయి. ఇటీవల పార్టీ అంతర్గత వ్యవహారాలపై పలువురు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చాయి.వైసీపీలో జగన్ తర్వాత పార్టీ వ్యవహారాలను నిర్వహించే విధానం గురించి చాలాకాలంగా రాజకీయ వర్గాల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సజ్జల రామకృష్ణారెడ్డి రాష్ట్ర సమన్వయకర్తగా పార్టీ కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. 2026లో ఆయన ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు వైసీపీ అధికారిక ప్రకటనలు కూడా వెల్లడిస్తున్నాయి.అయితే పార్టీకి సంబంధించిన నిర్ణయాలు క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలకు ఎంత వేగంగా చేరుతున్నాయి? వారి అభిప్రాయాలు అధిష్ఠానానికి ఎంతవరకు చేరుతున్నాయి? అనే ప్రశ్నలు మాత్రం కొనసాగుతున్నాయి. ఒక రాజకీయ పార్టీ బలంగా ఉండాలంటే అధ్యక్షుడికి క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రత్యక్ష సమాచారం అందడం, నాయకులతో నిరంతర సంప్రదింపులు ఉండటం కీలకంగా మారుతుంది. ముఖ్యంగా ఎన్నికల పరాజయం తర్వాత పార్టీ నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించుకోవాల్సిన పరిస్థితిలో ఈ అంశాలకు మరింత ప్రాధాన్యం ఉంటుంది.ఇక జిల్లాల స్థాయిలో కనిపిస్తున్న విభేదాలు వైసీపీకి మరో సవాలుగా మారుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్ తాజాగా సొంత పార్టీ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జిల్లా పార్టీ వ్యవహారాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, తమ్మినేని సీతారాంపై వచ్చిన విమర్శలను జిల్లా



నాయకత్వం ఖండించకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. ఇదే సమయంలో శ్రీకాకుళం వైసీపీలో అంతర్గత విభేదాలపై చిరంజీవి నాగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. పార్టీకి సంబంధించిన సమస్యలను అధిష్ఠానం నేరుగా పరిశీలించి పరిష్కరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.ఇలాంటి పరిస్థితుల్లో జగన్‌కు పార్టీపై మరింత ప్రత్యక్ష పర్యవేక్షణ, నాయకులతో విస్తృతంగా సంప్రదింపులు, జిల్లాల వారీగా సమస్యలపై సమీక్షలు అవసరమనే చర్చ జరుగుతోంది. ప్రత్యర్థి పార్టీల వ్యూహాలకు స్పందించడంతో పాటు సొంత పార్టీలోని అసంతృప్తిని ముందుగానే గుర్తించడం కూడా రాజకీయంగా కీలకమే. అయితే వైసీపీ మాత్రం ప్రస్తుతం కేడర్‌ను బలోపేతం చేయడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం, సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడంపై దృష్టి పెడుతున్నట్లు అధికారికంగా చెబుతోంది.జగన్ ముందున్న ప్రధాన అంశం పార్టీని మరింత సమర్థవంతమైన సంస్థగా తీర్చిదిద్దడం. నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ స్థాయి శ్రేణుల నుంచి వచ్చే అభిప్రాయాలను సమగ్రంగా స్వీకరించి, అవసరమైన చోట మార్పులు చేస్తే పార్టీ భవిష్యత్ రాజకీయ కార్యాచరణకు స్పష్టమైన దిశ ఏర్పడే అవకాశం ఉంటుంది.

తల్లి-చెల్లితో సెటిల్మెంట్ దిశగా పావులు



కడప, : కుటుంబం విషయంలో జగన్ తప్పుల్ని దిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. వైఎస్సార్ కుటుంబ అంతర్గత కలహాలు ఇప్పటికే రాజకీయంగా, సామాజికంగా ఊహించని నష్టాన్ని మిగిల్చాయి. ఎన్నికల వేళ చెల్లి షర్మిల, తల్లి విజయమ్మ రోడ్డెక్కి బహిరంగ లేఖలు రాయడం, పంపకాలపై కోర్టు మెట్లెక్కడం వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ విశ్వసనీయతను దారుణంగా దెబ్బతీశాయి. ఇంట్లోనే న్యాయం చేయలేని నాయకుడు రాష్ట్రానికి ఏం చేస్తాడన్న విపక్షాల ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లిందన్నది కాదనలేని సత్యం. ఈ క్రమంలో ఈ నష్టాన్ని ఇలాగే కొనసాగనిస్తే భవిష్యత్తు మరింత అగమ్యగోచరంగా మారుతుందని గ్రహించిన జగన్.. కుటుంబంతో వివాదాలకు తెరదించి, తల్లి-చెల్లితో సెటిల్మెంట్ దిశగా పావులు కదుపుతున్నారనే ప్రచారం జరుగుతోంది.ఈ పరిణామాల వెనుక ఉన్న ముఖ్య కారణం.. చుట్టూ ఉన్న సొంత కోటరీ పై జగన్‌కు నమ్మకం సన్నగిల్లడమేనని తెలుస్తోంది. వైఎస్ వివేకా హత్య కేసు నుంచి మొదలుకొని, షర్మిలకు వాటాల నిరాకరణ, ఎన్‌సీఎల్‌టీ వరకు వివాదాన్ని తీసుకెళ్లడంలో జగన్ పక్కనున్న కొందరు కీలక నేతలు, సలహాదారులే తప్పుదు మార్గదర్శనం చేశారన్న భావన ఇప్పుడు ఆయనలో బలపడినట్లు చెబుతున్నారు. కుటుంబంలో సయోధ్య కుదిర్చే బదులు చిచ్చు రాజేసి, తమ సొంత ప్రయోజనాలను కాపాడుకున్నారని ఆయన గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. తల్లి, చెల్లిని దూరం చేసుకుని పార్టీ పరంగానే కాకుండా నైతికంగా తీవ్ర ఏకాకిగా మారిన పరిస్థితుల్లో.. తన కోటరీ మాటలను పక్కనపెట్టి నేరుగా రాజీకి సిద్ధపడటమే మేలనే ఆలోచనకు జగన్ వచ్చినట్లు భావిస్తున్నారు.జగన్ ఆలోచనా విధానంలో వస్తున్న ఈ మార్పుకు జాతీయ రాజకీయ సమీకరణాలు కూడా ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. కేంద్రంలో బీజేపీతో ఉన్న సమీకరణాలు, రాష్ట్రంలో కూటమి పటిష్టత దృష్ట్యా.. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పుంజుకుంటుందనే గట్టి నమ్మకం వైఎస్సార్సీపీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. బీజేపీ అండ లేకపోతే కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి రక్షణ కష్టమని ఇన్నాళ్లూ భావించినప్పటికీ.. రేపటి రోజున కేంద్రంలో కాంగ్రెస్ కీలకంగా మారితే తన రాజకీయ భవిష్యత్తు కోసం ఆ పార్టీతో సఖ్యత తప్పనిసరి అని జగన్ అంచనా వేస్తున్నట్లు వినికిడి. అయితే, కాంగ్రెస్‌తో తెరవెనుక చర్చలు జరగాలన్నా, పార్టీ పెద్దల మద్దతు లభించాలన్నా.. ముందుగా రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్‌గా ఉన్న చెల్లెలు వైఎస్ షర్మిలతో ఉన్న వైరాన్ని పూర్తిగా పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఇరువర్గాల మధ్య రాయబారానికి చొరవ చూపుతున్నారన్న గుసగుసలు బలపడుతున్నాయి.ఒకవేళ ఈ సెటిల్మెంట్ నిజంగానే పట్టాలెక్కితే.. గతంలో కుదిరిన ఎంవోయూ ప్రకారం సరస్వతి పవర్, భారతి సిమెంట్స్, సాక్షి , బెంగుళూరు ఎలహంక ప్యాలెస్ వంటి ఆస్తుల వాటాలను షర్మిల, విజయమ్మ పేర్లపైకి బదలాయించేందుకు జగన్ సిద్ధపడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రాజకీయాల్లో అక్రమ సంపాదనగా ప్రత్యర్థులు ముద్రవేసిన ఆస్తుల్లో సైతం తన హక్కు కోసం పోరాడుతున్న షర్మిలకు ఆమె వాటా దక్కితే వివాదం సమసిపోవచ్చు. అయితే, జగన్ ఉచితంగా ఈ పంపకాలకు ఒప్పుకుంటారా అంటే కాదనే చెప్పాలి. ఆస్తుల సర్దుబాటుతో పాటుగా.. భవిష్యత్తులో జగన్‌ను రాజకీయంగా టార్గెట్ చేయకుండా ఉండాలని, రాజకీయంగా సహకరించారని షరతు పెట్టే అవకాశం ఉంది. అయితే, గత ఐదేళ్లలో వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్ర అవమానాలను ఎదుర్కొన్న షర్మిల.. కేవలం ఆస్తుల సర్దుబాటుతో జగన్ పెట్టే రాజకీయ షరతులకు ఏమేరకు తలొగ్గుతారు, కాంగ్రెస్ అధిష్ఠానం జగన్‌ను ఎంతవరకు విశ్వసిస్తుందనేది మాత్రం ఎవరూ చెప్పలేరు.

వైసీపీ కేడర్ లో అయోమయం

పోటీకి ద్వితీయ శ్రేణి నేతల అనాసక్తి

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో తీవ్ర అభద్రతాభావం, కంగారు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ నుండి స్థానిక నాయకులు, ఇన్‌ఛార్జ్‌లపై వస్తున్న ఆదేశాలు, హెచ్చరికలు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో తీవ్ర గందరగోళానికి దారితీస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయాల్సిందే, వెనకడుగు వేస్తే పార్టీ శత్రువులుగానే భావిస్తాం అంటూ అధిష్ఠానం స్పష్టమైన హెచ్చరికలు జారీ చేయడం వెనుక వైఎస్ఆర్‌సీపీ ఎదుర్కొంటున్న కఠినమైన రాజకీయ పరిస్థితికి సాక్ష్యంగా కనిపిస్తోంది. సమస్య హైకమాండ్ ఆదేశాల్లో కాదు.. క్షేత్రస్థాయిలో అభ్యర్థులు సిద్ధంగా లేకపోవడంలోనే ఉందనేది స్పష్టమవుతోంది. గ్రామాలు, మండలాల్లో పోటీ చేయగల ఆర్థిక, అంగ బలం ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు ఎవరూ కూడా ప్రస్తుతం బరిలోకి దిగేందుకు మొగ్గు చూపడం లేదు. 2024 సాధారణ ఎన్నికల ఓటమి తర్వాత వైఎస్ఆర్‌సీపీ గ్రాఫ్ గణనీయంగా పడిపోవడం, నియోజకవర్గ స్థాయి అగ్రనేతలు సైతం సైలెంట్ అయిపోవడం , కూటమి వైపు చూడటంతో దిగువ స్థాయి నాయకత్వం తీవ్ర దిక్కుతోచని స్థితిలో పడింది. పోటీకి కావాల్సిన భారీ వ్యయాన్ని భరించి, రాజకీయంగా రిస్క్ తీసుకోవడానికి చాలామంది స్థానిక నేతలు వెనకాడుతున్నారు.పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే.. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, పాత ఎమ్మెల్యేలకు కూడా గ్రామాలు, వార్డుల వారీగా అభ్యర్థులను వెతికి పట్టుకోవడం గగనతలమవుతోంది. బలమైన ఆర్థిక స్థోమత ఉన్న నేతలు ఇప్పటికే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పార్టీల కండువాలు కప్పుకోవడానికి ప్రాధాన్యత ఇస్తుండగా, మిగిలిన మధ్యస్థ నాయకులు పోటీకి దూరంగా ఉంటూ తటస్థంగా ఉండిపోవాలని భావిస్తున్నారు. పోటీ నుంచి తప్పుకుంటే భవిష్యత్తులో పార్టీలో స్థానం ఉండదు, మిమ్మల్ని శత్రువులుగా చూస్తాం అనే రీతిలో బెదిరింపుల రూపంలో ఒత్తిడి తెస్తుండటంతో వైఎస్ఆర్‌సీపీ క్యాడర్ నలిగిపోతోంది.ఈ భయానికి, ఆందోళనకు 2019-2024 మధ్య వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన స్థానిక ఎన్నికల తీరే ప్రధాన కారణమని స్థానిక నేతలు ఆవేదన వ్యక్తం



చేస్తున్నారు. అప్పట్లో ఏకగ్రీవాల పేరిట, అధికార బలాన్ని ప్రయోగించి ప్రత్యర్థులను పోటీ చేయకుండా నిరోధించారనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారడం, కూటమి అధికారంలోకి రావడంతో తాము పోటీకి దిగితే పాత బకాయిలు, రాజకీయ కక్షసాధింపులు, కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో ద్వితీయ శ్రేణి నేతలు వెనకడుగు వేస్తున్నారు. మరొక ప్రధానమైన అంశం.. నామినేషన్ల ఖర్చులు, ఎన్నికల నిర్వహణ వ్యయాన్ని పార్టీ పరంగా భరిస్తారా లేదా అనే దానిపై అధిష్ఠానం స్పష్టత ఇవ్వకపోవడం. కేవలం టికెట్ ఇస్తాం, పోటీ చేయండి అని ఒత్తిడి చేయడం తప్ప, ఓడిపోతే రక్షణగా ఉండే రాజకీయ అభయం గానీ, ఆర్థిక చేయూత గానీ దక్కడనే నమ్మకలేమి క్షేత్రస్థాయిలో బలంగా పాతుకుపోయింది. దీంతో ప్రతిష్టాత్మక స్థానిక ఎన్నికల్లో ఖాళీగా మిగిలిపోతే పార్టీ ఉనికికే ప్రమాదమని భావించిన అధిష్ఠానం, ఒత్తిడి తంత్రాలను ప్రయోగిస్తోందిఅధికారంలో ఉన్నప్పుడు చూపిన దూకుడు, ఓడిపోయాక క్యాడర్‌కు అందించాల్సిన భరోసాగా మారలేకపోవడమే వైఎస్ఆర్‌సీపీ ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణం. హెచ్చరికలు, ఒత్తిళ్లతో నామినేషన్లు వేయించగలరేమో గానీ, గ్రామాల్లో కార్యకర్తల్లో కసిని, ఆత్మవిశ్వాసాన్ని నింపలేరనేది స్పష్టమవుతోంది. ఈ ఫోర్స్డ్ పోటీ వ్యూహం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీకి ఎంతవరకు మేలు చేస్తుందో లేక క్యాడర్‌ను పార్టీకి మరింత దూరం చేస్తుందో వేచి చూడాలి.

రెండేళ్ల పాలనకు రెఫరెండమేనా

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు శరవేగంగా సాగుతుండటంతో, ఈ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం సాధించిన రెండేళ్ల పాలనకు రెఫరెండం అవుతాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. సర్వే ఏజెన్సీలు ఇచ్చే ప్రైవేటు సర్వేలు, ఒపీనియన్ పోల్స్ ఎన్ని వచ్చినా.. గ్రామ , నగర స్థాయిలో ఓటర్లు నేరుగా తమ ఓటు హక్కును వినియోగించుకునే ఈ ఎన్నికలే అసలైన ప్రజాభిప్రాయానికి నిలువెత్తు అద్దమని నమ్మడంలో సందేహం లేదు. అయితే, ఈ ఎన్నికలను బహిరంగంగా రెఫరెండం గా అంగీకరించేందుకు రాజకీయ పార్టీలు, ముఖ్యంగా అధికార పక్షం ముందుకు వస్తుందా లేదా అనేది అసలైన ప్రశ్న.సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలను తమ ప్రభుత్వ పాలనపై రెఫరెండం అని అధికారికంగా ప్రకటించడానికి ఇష్టపడవు. స్థానిక ఎన్నికల్లో కేవలం రాష్ట్రస్థాయి విధానాలు లేదా సంక్షేమ పథకాలే కాకుండా, స్థానిక అభ్యర్థి ఇమేజ్, కుల సమీకరణాలు, వ్యక్తిగత సంబంధాలు, ధనప్రవాహం వంటి అనేక హైపర్-లోకల్ అంశాలు ప్రభావం చూపుతాయి. ప్రభుత్వంపై ఎంత పాజిటివ్ వేవ్ ఉన్నప్పటికీ, స్థానికంగా ఎంపీటీసీ, సర్పంచ్ , కార్పొరేటర్ అభ్యర్థులపై ఉండే అసంతృప్తి వల్ల కూడా కొన్ని స్థానాలు చేజారే ప్రమాదం ఉంటుంది. అందుకే, అధికార కూటమి ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, దీనికి రెఫరెండం ముద్ర వేసి అనవసర రాజకీయ ప్రమాదాన్ని కొనితెచ్చుకోదు.మరోవైపు, ప్రైవేటు సర్వేల ను పక్కన పెడితే.. స్థానిక పోరులో వచ్చే ఫలితాలే అసలైన గ్రౌండ్ రియాలిటీని సూచిస్తాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన సంచలనాత్మక తీర్పు తర్వాత, కూటమి అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలు , అమరావతి అభివృద్ధి వంటి పరిణామాలు ప్రజల్లో ఎంతవరకు సానుకూలతను నింపాయో ఈ ఎన్నికల ద్వారా స్పష్టమవుతుంది. గ్రామీణ ,పట్టణ ఓటర్లు కూటమి పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారా లేదా అనేది బ్యాలెట్ బాక్సుల ద్వారా నిరూపితమవుతుంది. ఇక ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ



ఈ రెఫరెండం వాదనను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు, హామీల నెరవేర్పులో జరుగుతున్న జాప్యానికి ఈ ఎన్నికలే కొలమానం అని ప్రచారం చేయడం ద్వారా ఓటర్లను తమవైపు తిప్పుకోవచ్చని భావిస్తోంది. అయితే, జగన్ పార్టీ నిజంగా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అధికార పార్టీకి కౌంటర్ ఇవ్వాలంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రతీ స్థానంలోనూ గట్టి పోటీని ఇచ్చి ఓటర్లలో నమ్మకాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది. ఇక అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పరంగా చూస్తే, ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా, మిత్రపక్షాల మధ్య సమన్వయం ఎంతవరకు బలపడిందో తేల్చే వేదికగా మారనున్నాయి. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల స్థాయిలో టిక్కెట్ల కేటాయింపులో పార్టీల మధ్య ఘర్షణలు రాకుండా చూసుకోవడం కూటమి పెద్దలకు సవాలుగా మారనుంది.కూటమి నేతలు స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిపి భారీ విజయాన్ని సాధిస్తే, అది వైఎస్ఆర్‌సీపీ నైతిక ధైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, కూటమి పాలనకు ప్రజల ఆమోదముద్ర పడినట్లే అవుతుంది. సాంకేతికంగా లేదా అధికారికంగా ఏ పార్టీ కూడా ఈ స్థానిక పోరును పాలనా రెఫరెండం అని ఒప్పుకోకపోయినా, రాజకీయ విశ్లేషకుల దృష్టిలో మరియు ప్రజల ఆలోచనల్లో ఇది కచ్చితంగా కూటమి ప్రభుత్వ పనితీరుకు వేసే గ్రేడింగ్ మార్కులే. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలకు స్పష్టమైన పొలిటికల్ రోడ్‌మ్యాప్‌ను, మూడ్‌ను నిర్దేశిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు

25 నుంచి కొత్త జిల్లా జెడ్పీ కార్యక్రమాలు

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పరిపాలన వికేంద్రీకరణ దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన 15 జిల్లాల్లో ఈ నెల 25వ తేదీ నుంచి జిల్లా పరిషత్ (జడ్పీ) కార్యాలయాల తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. ప్రస్తుత జడ్పీ పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ఈ నెల 24వ తేదీతో ముగియనుండడంతో, మరుసటి రోజే కొత్త జిల్లాల పరిధిలో నూతన జడ్పీ వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చేందుకు పంచాయతీరాజ్ శాఖ వేగంగా ఏర్పాట్లు చేస్తోంది.కొత్త జిల్లాల జడ్పీల నిర్వహణ కోసం ప్రభుత్వం ఇటీవలనే పరిపాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా 15 జడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (అఖా), అలాగే మరో 15 డిప్యూటీ సీఈవో పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన పంచాయతీరాజ్ శాఖ అధికారులకు త్వరలోనే పదోన్నతులు కల్పించనున్నారు. జడ్పీల విభజన ప్రక్రియ సజావుగా సాగేలా చూడడానికి వీలుగా పాత ఉమ్మడి జిల్లాల కార్యాలయాల నుంచి సిబ్బందిని హేతుబద్ధీకరించి కొత్త జిల్లాలకు కేటాయిస్తున్నారు.ప్రస్తుతానికి శాశ్వత భవనాల నిర్మాణం పూర్తయ్యే వరకు, అన్ని జిల్లాల్లోనూ అనువైన ప్రభుత్వ లేదా ప్రైవేట్ తాత్కాలిక భవనాల్లోనే ఈ కార్యాలయాలను ప్రారంభించనున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన నిధుల మంజూరు, ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ, స్థానిక సంస్థల అభివృద్ధి పనుల ప్ర

షుగర్ పేషెంట్లు జామపండు తినొచ్చా...?



పండ్లు ఆరోగ్యానికి మంచివే అయినా.. షుగర్, బీపీ వంటి సమస్యలు ఉన్నవారు ఏ పండు పడితే అది తినకుండా కొన్ని విషయాలను తప్పక గమనించాలి. ముఖ్యంగా తీపి ఎక్కువగా ఉండే పండ్ల విషయంలో చాలామందికి సందేహాలు ఉంటాయి. అయితే జామపండు మాత్రం ఫైబర్, విటమిన్ అ వంటి పోషకాలు సమృద్ధిగా ఉండే పండుగా గుర్తింపు పొందింది. జామపండులో ఫైబర్ ఉండటం వల్ల రక్తంలో గ్లూకోజ్ వేగంగా పెరగకుండా ఉండేందుకు సహాయపడే ఆహార ఎంపికగా పరిగణించవచ్చు. ముఖ్యంగా జ్యూస్ రూపంలో కాకుండా మొత్తం పండుగా తినడం వల్ల ఫైబర్ కూడా లభిస్తుంది. అయితే డయాబెటిస్ ఉన్నవారు ఎంత మోతాదులో తినాలి అనేది వారి మొత్తం ఆహారం, మందులు, రక్తంలో చక్కెర స్థాయిలపై ఆధారపడి ఉంటుంది. జామపండులో విటమిన్ అ గణనీయంగా ఉంటుంది. ఈ విటమిన్ శరీరంలో సాధారణ రోగనిరోధక వ్యవస్థ పనితీరుకు అవసరం. యాంటీఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. అందువల్ల ఆహారంలో జామపండును చేర్చుకోవడం ద్వారా విటమిన్ అ అవసరాల్లో కొంత భాగాన్ని పొందవచ్చు. జామపండులో డైటరీ ఫైబర్ ఉంటుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి, మలబద్ధకం తగ్గడానికి సహాయపడుతుంది. సమతుల్య ఆహారంలో ఫైబర్ ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను చేర్చుకోవడం సాధారణంగా ఆరోగ్యకరమైన అలవాటుగా పరిగణిస్తారు. బీపీ ఉన్నవారు జామపండును ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. అయితే జామపండు బీపీని తగ్గించే మందు కాదు. బీపీ నియంత్రణకు ఉప్పు పరిమితం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, శారీరక చురుకుదనం, వైద్యులు సూచించిన మందులు వాడటం వంటి చర్యలు ముఖ్యమైనవి. జామపండు వంటి పండ్లను ఆహారంలో చేర్చుకోవడం ఆరోగ్యకరమైన ఆహార విధానంలో ఒక భాగంగా ఉండొచ్చు. కానీ కేవలం జామపండు తినడం వల్ల అధిక రక్తపోటు తగ్గిపోతుందని భావించకూడదు. జామపండును శుభ్రంగా కడిగి, ముక్కలుగా కోసుకుని నేరుగా తినడం మంచి మార్గం. దానికి అదనంగా చక్కెర, ఉప్పు, మసాలాలు ఎక్కువగా కలపాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా షుగర్ ఉన్నవారు జామపండు జ్యూస్ కంటే పండుగానే తీసుకోవడం మంచిది. పండును నమిలి తినడం వల్ల దానిలోని ఫైబర్ కూడా ఆహారంలో భాగమవుతుంది. జామపండు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ అ వంటి పోషకాలను అందిస్తుంది. అయితే దీనిని ప్రత్యేకంగా 'డిటాక్స్ ఫుడ్'గా తీసుకుని శరీరంలోని అన్ని టాక్సిన్లను తొలగిస్తుందని చెప్పడం సరైంది కాదు.

చిన్నవయసులోనే కీళ్ల నొప్పులా....?



కీళ్ల నొప్పులు అంటే వృద్ధాప్యంలో వచ్చే సమస్యగానే చాలామంది భావిస్తారు. కానీ ప్రస్తుతం యువతలోనూ మోకాళ్లు, భుజాలు, మోచేతులు, మణికట్టు వంటి కీళ్లలో నొప్పి, బిగుతు, వాపు వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. స్పోర్ట్స్ ఆడేవారు, జిమ్‌లో అధికంగా వ్యాయామం చేసేవారు, శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు మాత్రమే కాకుండా.. రోజువారీ జీవితంలో ఒకే రకమైన కదలికలను పదేపదే చేసే వారిలోనూ ఈ సమస్య తలెత్తవచ్చు. కీళ్ల నొప్పులు అంటే వృద్ధాప్యంలో వచ్చే సమస్యగానే చాలామంది భావిస్తారు. కానీ ప్రస్తుతం యువతలోనూ మోకాళ్లు, భుజాలు, మోచేతులు, మణికట్టు వంటి కీళ్లలో నొప్పి, బిగుతు, వాపు వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. స్పోర్ట్స్ ఆడేవారు, జిమ్‌లో అధికంగా వ్యాయామం చేసేవారు, శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు మాత్రమే కాకుండా.. రోజువారీ జీవితంలో ఒకే రకమైన కదలికలను పదేపదే చేసే వారిలోనూ ఈ సమస్య తలెత్తవచ్చు.కీళ్ల నొప్పులకు ఒక్కటే కారణం ఉండదు. గాయం, బెణుకడం, కండరాలపై అధిక ఒత్తిడి వంటివి కీలు చుట్టూ ఉన్న కణజాలాన్ని దెబ్బతీసి నొప్పి, వాపుకు కారణమవుతాయి. ముఖ్యంగా క్రీడల్లో పాల్గొనే యువతలో ఇలాంటి సమస్యలు ఎక్కువగా కనిపించవచ్చు. మరో కారణం గౌట్. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగి దాని స్ఫటికాలు కీళ్లలో పేరుకుపోతే అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి, వాపు, ఎరుపు, వేడి వంటి లక్షణాలు కనిపించవచ్చు. అలాగే రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధుల్లో రోగనిరోధక వ్యవస్థ పొరపాటున కీళ్లపై దాడి చేయడం వల్ల నొప్పి, వాపు ఏర్పడతాయి. వయసుతో ఎక్కువగా సంబంధం ఉన్న ఆస్టియో ఆర్థరైటిస్ కూడా కొన్ని సందర్భాల్లో చిన్న వయసులోనే కనిపించవచ్చు.

కీళ్ల మధ్య ఉండే మృదులాస్థి దెబ్బతినడం, అరిగిపోవడం వల్ల కదలికలో నొప్పి, బిగుతు ఏర్పడుతుంది. ఇవే కాకుండా టెండినైటిస్, లూపస్, ఫైబ్రోమయాల్జియా, థైరాయిడ్ సమస్యలు, కొన్ని వైరల్ ఇన్ఫెక్షన్లు కూడా కీళ్ల నొప్పులకు కారణం కావచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కీళ్ల నొప్పితో పాటు వాపు, ఎరుపు, అధిక వేడి లేదా జ్వరం ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. గాయం తర్వాత కీలు ఆకారం మారడం, అకస్మాత్తుగా తీవ్రమైన వాపు రావడం లేదా నొప్పి కారణంగా కీలును కదపలేకపోవడం వంటి పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా వైద్య సహాయం తీసుకోవాలి. తేలికపాటి నొప్పి కొన్నిసార్లు విశ్రాంతితో తగ్గిపోవచ్చు.

బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి తాగారా?

ఉదయం నిద్రలేవగానే బ్లాక్ కాఫీ తాగే అలవాటు చాలామందికి ఉంటుంది. అయితే ఇటీవల బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి తాగడం కూడా సోషల్ మీడియాలో ట్రెండ్‌గా మారింది. ఈ డ్రింక్ తాగితే



త్వరగా బరువు తగ్గొచ్చని, శరీరంలోని కొవ్వు కరిగిపోతుందని, డిటాక్స్ అవుతుందని ప్రచారం జరుగుతోంది. బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి.. బరువు తగ్గించే అద్భుతమైన పానీయంగా భావించడం సరైంది కాదు. బ్లాక్ కాఫీలో ఉండే కెఫీన్ కొంతసేపు శక్తిని పెంచుతుంది. కొంతమందిలో ఆకలిని స్వల్పంగా తగ్గించే ప్రభావం కూడా ఉండొచ్చని యథార్థ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని డైటెటిక్స్ విభాగం అధిపతి సుహానీ సేథ్ అగర్వాల్ అంటున్నారు. అయితే ఈ ప్రభావంతోనే శరీరంలోని అదనపు కొవ్వు వేగంగా కరిగిపోతుందని చెప్పడానికి ఆధారాలు లేవట. బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలపడం వల్ల అదనంగా కొవ్వు కరుగుతుందని లేదా వేగంగా బరువు తగ్గుతారని నిరూపించే బలమైన శాస్త్రీయ ఆధారాలు ప్రస్తుతం లేవు. కాఫీలోని కెఫీన్ కొద్దిసేపు జీవక్రియను, శక్తి వినియోగాన్ని పెంచవచ్చు. కానీ ఈ ప్రభావం పరిమితంగానే ఉంటుంది.

కళ్లలో పసుపు రంగు కనిపిస్తోందా?

కొన్ని ఆరోగ్య సమస్యలు శరీరంలో మార్పులు మొదలైన వెంటనే మనకు తెలియజేస్తాయి. కానీ కొన్ని వ్యాధుల విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ముఖ్యంగా ప్యాంక్రియాస్‌కు సంబంధించిన క్యాన్సర్ ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చు. అందుకే సాధారణ జీర్ణ సమస్యలుగా భావించి కొన్ని సంకేతాలను చాలామంది పట్టించుకోరు. ప్యాంక్రియాస్ లేదా క్లోమం పొట్ట లోపల, కడుపు వెనుక భాగంలో ఉండే ముఖ్యమైన అవయవం. జీర్ణక్రియకు అవసరమైన ఎంజైమ్‌లను తయారు చేయడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే హార్మోన్ల ఉత్పత్తిలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఈ అవయవంలో క్యాన్సర్ ఏర్పడినప్పుడు ప్రారంభంలో పెద్దగా లక్షణాలు కనిపించకపోవచ్చు. కణితి పెరిగి చుట్టుపక్కల అవయవాలు లేదా పిత్తనాళాలపై ప్రభావం చూపినప్పుడు కొన్ని లక్షణాలు బయటపడే అవకాశం ఉంటుంది. చర్మం లేదా కళ్ల తెల్లని భాగం పసుపు రంగులోకి మారడం జాండిస్ (కామెర్లు) లక్షణం కావచ్చు. ప్యాంక్రియాస్‌లోని కణితి పిత్తనాళాన్ని అడ్డుకుంటే బిలిరుబిన్ శరీరంలో పేరుకుపోయి ఈ మార్పు రావచ్చు. మూత్రం ముదురు రంగులోకి మారడం, మలం లేత రంగులో కనిపించడం, చర్మంపై తీవ్రమైన దురద కూడా దీనితో పాటు ఉండొచ్చు. ఆహారంలో పెద్దగా మార్పులు చేయకపోయినా బరువు తగ్గడం గమనిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌తో పాటు అనేక ఇతర ఆరోగ్య సమస్యల్లోనూ అనుకోకుండా బరువు తగ్గడం కనిపించవచ్చు. అందువల్ల ఈ ఒక్క లక్షణం ఆధారంగా క్యాన్సర్ అని నిర్ధారించుకోకూడదు. కానీ నిరంతరంగా బరువు తగ్గుతుంటే వైద్య పరీక్ష అవసరం. పొత్తికడుపు పైభాగంలో నొప్పి లేదా మధ్య భాగం వెన్ను వరకు వ్యాపించే నొప్పి కూడా ఒక సంకేతంగా ఉండొచ్చు. అయితే ఇలాంటి నొప్పికి గ్యాస్,



జీర్ణ సమస్యలు, కండరాల సమస్యలు వంటి ఎన్నో కారణాలు ఉండవచ్చు. నొప్పి కొత్తగా మొదలై తగ్గకుండా కొనసాగుతున్నా, క్రమంగా ఎక్కువవుతున్నా వైద్యుడిని సంప్రదించడం మంచిది. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌లో ఆకలి తగ్గడం, వికారం, వాంతులు, పొట్ట ఉబ్బరం, త్వరగా కడుపు నిండినట్లు అనిపించడం వంటి జీర్ణ సంబంధిత సమస్యలు కనిపించవచ్చు. కొందరిలో కొవ్వు ఎక్కువగా ఉన్నట్లుగా కనిపించే లేదా లేత రంగులో ఉండే మలం కూడా కనిపించవచ్చు. ప్యాంక్రియాస్ ఇన్సులిన్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల కొంతమందిలో ప్యాంక్రియాస్‌కు సంబంధించిన సమస్యలతో కొత్తగా డయాబెటిస్ బయటపడవచ్చు లేదా ఇప్పటికే ఉన్న షుగర్ నియంత్రణ కష్టంగా మారవచ్చు. ముఖ్యంగా ఇతర లక్షణాలతో పాటు అకస్మాత్తుగా రక్తంలో చక్కెర స్థాయిలు మారితే వైద్యుడితో చర్చించడం మంచిది. ఎటువంటి స్పష్టమైన కారణం లేకుండా శరీరమంతా తీవ్రమైన దురద రావడం కూడా కొన్నిసార్లు జాండిస్‌తో సంబంధం కలిగి ఉండవచ్చు.

ఉదయం నిద్ర లేవగానే చాలా సేపటి వరకు నడుము బిగుతుగా ఉంటుందా



దయం నిద్రలేవగానే నడుము బిగుసుకుపోయినట్టు అనిపించడం చాలామందికి సాధారణ సమస్యగా కనిపిస్తుంది. అయితే ఈ నొప్పి ప్రతిరోజూ కొనసాగుతూ గంటల పాటు తగ్గకపోతే, అది తీవ్రమైన వెన్నెముక సమస్యకు సంకేతం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అంకిలోజింగ్ స్పాండిలైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రారంభ లక్షణంగా దీన్ని పరిగణిస్తున్నారు. తాజాగా వచ్చిన ఒక అధ్యయనం ప్రకారం హోల్ బాడీ క్రయోథెరపీ అనే చికిత్సా విధానం ఈ సమస్యతో బాధపడుతున్న వారికి ఉపశమనం కలిగించే అవకాశముందని వెల్లడైంది. అంకిలోజింగ్ స్పాండిలైటిస్ అనేది వెన్నెముక, కీళ్లను ప్రభావితం చేసే దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేటరీ వ్యాధి. వెంటనే వైద్యులను సంప్రదించాలి..ఈ సమస్య ఉన్నవారిలో ఉదయం సమయంలో నొప్పి, బిగుతు, కదలికల్లో ఇబ్బందులు ఎక్కువగా కనిపిస్తాయి. శరీరం విశ్రాంతిలో ఉన్నప్పుడు కండరాలు గట్టిపడటం వల్ల ఉదయాన్నే నొప్పి తీవ్రమవుతుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా యువతలో ఈ సమస్య పెరుగుతున్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. నిపుణుల ప్రకారం కొన్ని లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఉదయం నడుము నొప్పి గంటకు పైగా కొనసాగడం, ప్రతిరోజూ పునరావృతం కావడం, విశ్రాంతి తీసుకున్నప్పుడు నొప్పి పెరగడం, కదలికలతో కొంత ఉపశమనం కలగడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. కుటుంబంలో ఆర్థరైటిస్ చరిత్ర ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. యూరోపియన్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన తాజా సమీక్షలో హోల్ బాడీ క్రయోథెరపీ వల్ల అంకిలోజింగ్ స్పాండిలైటిస్ రోగులకు ప్రయోజనం కలగవచ్చని వెల్లడైంది.క్రయోథెరపీతో మెరుగైన ఫలితాలు..మొత్తం 310 మంది రోగులపై నిర్వహించిన ఐదు అధ్యయనాల డేటాను విశ్లేషించగా, ఈ థెరపీ వల్ల నొప్పి, ఉదయపు బిగుతు తగ్గినట్లు గుర్తించారు. అలాగే శరీర కదలికలు మెరుగుపడటంతోపాటు రోగుల జీవన నాణ్యత కూడా కొంత మెరుగైనట్లు అధ్యయనంలో తేలింది. క్రయోథెరపీ అనేది శరీరాన్ని అత్యల్ప ఉష్ణోగ్రతలకు కొద్దిసేపు గురిచేసే చికిత్సా విధానం. సాధారణంగా మైనస్ ఉష్ణోగ్రతల్లో 80 సెకన్ల నుంచి మూడు నిమిషాల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. దీని వల్ల శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గి కండరాలు సడలుతాయి. అయితే ఇది పూర్తిస్థాయి చికిత్స కాదని, కేవలం సహాయక థెరపీగా మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేస్తున్నారు.అందరికీ పడకపోవచ్చు..అయితే ఈ థెరపీ అందరికీ అనుకూలం కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గర్భధారణ సమయంలో మహిళలకు వచ్చే ముఖ్యమైన సమస్యలు ఇవే...

గర్భధారణ ప్రతి మహిళ జీవితంలో ఎంతో ఆనందకరమైన దశ. అయితే ఈ సమయంలో శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకోవడంతో కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంటుంది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇవి తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి.

అందుకే గర్భధారణ సమయంలో క్రమం తప్పని వైద్య పరీక్షలు, పోషకాహారం, ఆరోగ్యకర జీవనశైలి చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రక్తహీనత, అధిక రక్తపోటు, గర్భకాల మధుమేహం వంటి సమస్యలను ముందుగానే గుర్తిస్తే ప్రమాదాలను తగ్గించే అవకాశం ఉంటుంది. ప్రతి సంవత్సరం ఇదే విషయంపై నేషనల్ సేఫ్ మదర్‌హుడ్ డేను ఈ సమయంలో నిర్వహిస్తారు. గర్భిణీల ఆరోగ్యం, మాతృ మరణాల తగ్గింపు, సురక్షిత ప్రసవాలపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. సరైన వైద్య సేవలు, గర్భధారణ సమయంలో పరీక్షలు, ప్రసవానంతర సంరక్షణ ప్రతి మహిళకు అందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.గర్భస్థ సమయంలో మధుమేహం..ఇక గర్భధారణ సమయంలో ఎక్కువగా కనిపించే సమస్యల్లో గర్భకాల మధుమేహం ఒకటి. ఈ పరిస్థితిలో రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల శిశువు అధిక బరువుతో పుట్టే అవకాశం ఉండటంతో పాటు ప్రసవ సమయంలో సమస్యలు వస్తాయి.



చర్మం ఆరోగ్యంగా, అందంగా కనిపించాలంటే

ఖరీదైన క్రీములు అవసరం లేదు.. వీటిని తీసుకోండి చాలు..



చర్మం అందంగా, కాంతివంతంగా ఉండాలంటే ఖరీదైన క్రీములు లేదా సుదీర్ఘమైన స్కిన్‌కేర్ రొటీన్లు అవసరమని చాలా మంది భావిస్తారు. అయితే నిపుణులు చెబుతున్నది మాత్రం వేరే విషయం. మనం ప్రతిరోజూ తీసుకునే ఆహారమే చర్మ ఆరోగ్యంపై అధిక ప్రభావం చూపుతుందని వారు తెలియజేస్తున్నారు. మొటిమలు, మసకబారిన చర్మం, డార్క్ సర్కిల్స్, పొడిబారిన చర్మం వంటి సమస్యలు చాలా సందర్భాల్లో శరీరంలో పోషక లోపాలను సూచిస్తాయని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు. రోజువారీ ఆహారంలో కొన్ని సాధారణ పదార్థాలను చేర్చడం ద్వారా చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఎలాంటి ఆహారాలను తీసుకోవాలో వారు తెలియజేస్తున్నారు.పచ్చి ఉసిరికాయ, స్పియర్‌మింట్ టీ..మసకబారిన చర్మానికి పచ్చి ఉసిరికాయ మంచి ఔషధంగా పని చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

భోజనం చేశాక ఈ మూడు రకాల గింజలను తినండి



భోజనం చేసిన తర్వాత కడుపు ఉబ్బరం, గ్యాస్, అసిడిటీ, భారంగా అనిపించడం వంటి సమస్యలు చాలా మందిని వేధిస్తుంటాయి. ముఖ్యంగా ఆయిల్ ఎక్కువగా ఉన్న ఆహారం లేదా భారమైన భోజనం చేసినప్పుడు జీర్ణక్రియ నెమ్మదిగా మారుతుంది. ఇలాంటి సమస్యలకు సహజసిద్ధమైన పరిష్కారంగా సోంపు, వాము, జీలకర్ర గింజలను నమలాలని నిపుణులు సూచిస్తున్నారు. సరైన మోతాదులో ఈ గింజలను తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు పొట్ట అసౌకర్యాలు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. భోజనం తర్వాత ఈ మూడు గింజలను నమలడం భారతీయ సంప్రదాయంలో చాలా కాలంగా ఉంది. అయితే దీనికి శాస్త్రీయ కారణాలూ ఉన్నాయని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు. గింజలను నెమ్మదిగా నమలడం వల్ల వాటిలోని సహజసిద్ధమైన సంయోగాలు లాలాజలంతో కలిసి శరీరంలోకి చేరి జీర్ణక్రియను వేగవంతం చేస్తాయని చెబుతున్నారు.జీర్ణ సమస్యలకు అనేక కారణాలు..అసలు భోజనం తర్వాత జీర్ణక్రియ ఎందుకు నెమ్మదిస్తుంది అనే విషయాన్ని పరిశీలిస్తే, అధిక కొవ్వు, రిఫైన్ కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు పేగులు ఆహారాన్ని జీర్ణం చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి.

నివా బుపాపై ఐఆర్‌డీఏఐ వేటు...!



ప్రముఖ ఆరోగ్య బీమా సంస్థ 'నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్'కు బీమా నియంత్రణ మండలి 'ఐఆర్‌డీఏఐ' షాక్ ఇచ్చింది. రాబోయే ఆరు నెలల పాటు దేశవ్యాప్తంగా ఎలాంటి కొత్త బ్రాంచులు ప్రారంభించవద్దని కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ఐఆర్‌డీఏఐ
ఇచ్చిన ఆదేశాలను నిశితంగా పరిశీలిస్తున్నామని, తమ వాటాదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చట్టపరమైన, వ్యాపారపరమైన చర్యలు తీసుకుంటామని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వివరించింది.
అయితే, కంపెనీ నడపడానికి ఐఆర్‌డీఏఐ ఎంతవరకు ఖర్చు చేయవచ్చని పరిమితి విధించిందో, 2024-25లో నివా బుపా ఆ హద్దులు దాటి ఎక్కువగా ఖర్చు చేసింది. అందుకే ఐఆర్‌డీఏఐ ఈ చర్యలు తీసుకుంది. కానీ, 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ, ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనూ (ఏప్రిల్-జూన్) తాము ఐఆర్‌డీఏఐ ఖర్చుల నిబంధనలను కచ్చితంగా పాటించామని కంపెనీ స్పష్టం చేసింది. ఇకపై కూడా ఈ నిబంధనలు దాటకుండా జాగ్రత్తగా ఉంటామని పేర్కొంది. ఈ పరిణామంతో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో కంపెనీ షేర్ ధరపై ప్రభావం కనిపించింది. బీఎస్ఈలో నివా బుపా షేర్ ధర దాదాపు 2 శాతం క్షీణించి రూ. 82.61 వద్ద ముగిసింది.ఐఆర్‌డీఏఐ ఇచ్చిన ఆదేశాలను నిశితంగా పరిశీలిస్తున్నామని, తమ వాటాదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చట్టపరమైన, వ్యాపారపరమైన చర్యలు తీసుకుంటామని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వివరించింది.

ఎల్‌పీజీ సరఫరాకు మరో దారి..!



వంట గ్యాస్ (ఎల్పీజీ) సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా చూసేందుకు దేశీయ అతిపెద్ద ఇంధన సంస్థ 'ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్' (ఐఓసీ) కీలక అడుగు వేసింది. పశ్చిమాసియా దేశాలపైనే పూర్తిగా ఆధారపడటాన్ని తగ్గిస్తూ, అల్జీరియా ప్రభుత్వ రంగ సంస్థ 'సోనాట్రాచ్'తో 2027 నుండి ఎల్పీజీని దిగుమతి చేసుకునేందుకు దీర్ఘ కాలపరిమితి ఒప్పందాన్ని ఖరారు చేసే పనిలో ఉంది. ఈ ఒప్పందం ప్రకారం, ప్రొపేన్, బ్యూటేన్ మిశ్రమంతో కూడిన 45,000 నుండి 55,000 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీని ప్రతి నెలా భారీ షిప్పుల ద్వారా ఐఓసీ భారత్‌కు తరలిస్తుంది.
గతంలో సౌదీ అరామ్‌కో వంటి మధ్యప్రాచ్య సంస్థల నుండి కొనుగోలు చేసినప్పటికీ, అల్జీరియన్ ఎల్‌పీజీ ధర చాలా తక్కువగా ఉండటం ఐఓసీకి కలిసిరానుంది. ఇప్పటికే జూన్ నుండి అల్జీరియా గ్యాస్ దిగుమతిని ప్రారంభించిన భారత్, ఆగస్టులో దాదాపు 1.10 లక్షల టన్నులను అందుకోనుంది. హోర్ముజ్ జలసంధి వద్ద యుద్ధ పరిస్థితులు, రవాణా ముప్పు వల్ల దేశీయంగా ఎల్‌పీజీ కొరత రాకుండా ఉండేందుకు కేంద్రం సరఫరాదారుల వరిధిని విస్తరిస్తోంది. ఇందులో భాగంగానే 2027 నాటికి మనదేశ మొత్తం ఎల్‌పీజీ దిగుమతుల్లో 25 శాతం ఒక్క అమెరికా నుంచే పొందేందుకు ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ సంస్థలు ఉమ్మడిగా టెండర్లు పిలవనున్నాయి.
ఒకవైపు పైపుల ద్వారా సరఫరా చేసే సహజ వాయువును ప్రోత్సహిస్తూనే, మరోవైపు అల్జీరియా, అమెరికా వంటి ప్రత్యామ్నాయ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా దేశంలో కోట్లాది ఇళ్లకు అవసరమైన వంట ఇంధన భద్రతను భారత్ బలోపేతం చేసుకుంటోంది.

40 ట్రిలియన్ డాలర్లు చేరిన అమెరికా అప్పు...



అమెరికా ఆర్థికవ్యవస్థపై అప్పుల భారం మునుపెన్నడూ లేనంత స్థాయికి చేరింది. ఆ దేశ జాతీయ అప్పు చరిత్రలోనే తొలిసారిగా 40 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటినట్లు ట్రెజరీ డిపార్ట్‌మెంట్ అధికారికంగా వెల్లడించింది. రాబడికి మించి విపరీతంగా పెరిగిపోతున్న ప్రభుత్వ ఖర్చులు, పన్ను కోతలు, వడ్డీ భారం వల్ల తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ముంచుకొస్తోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అమెరికా ప్రభుత్వం వసూలు చేసే పన్నుల కంటే ఖర్చులే ఎక్కువగా ఉండటంతో ప్రతి ఏటా బడ్జెట్ లోటు పెరిగిపోతోంది. ప్రధానంగా వృద్ధాప్య జనాభా పెరగడం వల్ల సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ వంటి సంక్షేమ పథకాల వ్యయం విపరీతంగా పెరిగింది.
దీనికి తోడు రక్షణ రంగానికి చేసే భారీ కేటాయింపులు, ట్రంప్ పాలనలోని పన్ను కోతల చట్టాలు ప్రభుత్వం వచ్చే ఆదాయాన్ని తగ్గించి, లోటును మరింత పెంచాయి. కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ (సీబీఓ) అంచనా ప్రకారం, 2026 నాటికి అమెరికా బడ్జెట్ లోటు 1.9 ట్రిలియన్ డాలర్లకు చేరనుంది. ప్రస్తుతం పాత అప్పులు తీర్చడానికి, వడ్డీలు చెల్లించడానికే అమెరికా మళ్లీ కొత్తగా అప్పులు చేయాల్సిన క్లిష్ట పరిస్థితి ఏర్పడింది. 2026 మొదటి 10 నెలల్లోనే నికర వడ్డీ చెల్లింపులు 963 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది అమెరికా జాతీయ రక్షణ బడ్జెట్ కంటే కూడా ఎక్కువ కావడం గమనార్హం.
గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ ఆధిపత్యం వల్ల ప్రస్తుతానికి నిలదొక్కుకుంటున్నప్పటికీ, పెరిగిన వడ్డీ రేట్ల వల్ల ప్రభుత్వం కొత్తగా రుణాలు సేకరించడం మరింత ఖరీదైన విషయంగా మారింది. ఇది అమెరికా వెంటనే డిఫాల్ట్ అవుతుందని అర్థం కాకపోయినా, రుణ భారం వేగంగా పెరిగితే పెట్టుబడిదారులు అధిక రాబడులు డిమాండ్ చేసి, ఆర్థిక వ్యవస్థపై రుణ భారాలను మోపే ప్రమాదముందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

పాతబస్తీకి నెరవేరనున్న మెట్రో కల

భాగ్యనగరంలోని పాతబస్తీ పుర వీధుల్లో పర్యటిస్తుంటే ఆసక్తికరమైన ఫ్లెక్సీలు కనిపిస్తుంటాయి. మూసీ నది దాటిన తర్వాత చారిత్రాత్మకమైన పాతబస్తీలో మెట్రో రైలు పనుల్లో భాగంగా కూలుస్తున్న నిర్మాణాల ముందు 'ఓల్డ్ సిటీ అంటే ఒరిజినల్ సిటీ' అంటూ పోస్టర్లలో కనిపించే నినాదాలు కార్యరూపం దాలుస్తున్నాయని స్థానికులు భావిస్తున్నారు. ప్రభుత్వం న్యూ సిటీతో పాటు ఒరిజినల్ ఓల్డ్ సిటీకి కూడా సమ ప్రాధాన్యతిస్తుందనే విశ్వాసం అక్కడి ప్రజల్లో కలుగుతోంది. నగరం నలువైపులా ఉన్న మెట్రో రైలును పాతబస్తీలో కూడా విస్తరింపచేసేందుకు పనులు వేగవంతం చేయాలని, భూసేకరణ వేగవంతం చేసి, త్వరలో టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించడంతో ఒరిజినల్ సిటీకి గుర్తింపు లభిస్తుందనే భరోసా పాతబస్తీ వాసుల్లో కలుగుతోంది. హైదరాబాద్ అభివృద్ధి కథలో పాతబస్తీకి మెట్రో రైలు అనుసంధానం చాలా కాలంగా అసంపూర్తిగా ఉన్న అధ్యాయం. గ్రేటర్‌లోని ఇతర ప్రాంతాల్లో మెట్రో పరుగులు తీస్తున్నా నగరంలో దాదాపు 25 శాతానికిపైగా జనాభా నివసించే పాతబస్తీలో మాత్రం మెట్రో అందుబాటులో లేకపోవడం పెద్ద లోటుగా మారింది.
నగరంలో రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడంలో భాగంగా 2012లో మూడు మార్గాల్లో మెట్రో రైలు పనులు ప్రారంభమైనా వాటిలో జెబిఎస్ ఫలక్‌నుమా కారిడార్ అసంపూర్తిగా మిగిలిపోవడంతో పాతబస్తీ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ మార్గంలో ఎంజిబిఎస్ వరకు పనులు పూర్తయినా, అక్కడి నుంచి ఫలక్‌నుమా వరకు ఉన్న పాతబస్తీ భాగం మాత్రం అనేక కారణాలతో పెండింగ్‌లో ఉండిపోయాయి. పాతబస్తీ మెట్రో ఆలస్యానికి సాంకేతిక సమస్యలే కాకుండా సామాజిక, రాజకీయ సున్నితత్వం కూడా కారణమైంది. ఇక్కడి ఇరుకైన రహదారులు, భారీగా ఉన్న ఆస్తులు, మతపరమైన, వారసత్వ కట్టడాలు, భూసేకరణ వంటి సమస్యలతోపాటు స్థానిక రాజకీయ ఆధిపత్య
ధోరణులు కూడా అడ్డంకిగా నిలిచాయి. పాతబస్తీలో 103 మతపరమైన కట్టడాలు ఉన్నాయని, వాటి పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని మెట్రో మార్గాన్ని రూపొందించాల్సి వస్తుందని 2018లో నాటి ప్రభుత్వం వెల్లడించి చేతులు దులుపుకుంది. ఈ నిర్మాణాల్లో 21 మసీదులు, 12 ఆలయాలు, 12 ఆశూర్ఖానాలు, 33 దర్గాలు, 7 శ్మశాన/ సమాధి ప్రాంతాలు, 6 చిల్లాలు తదితర సున్నిత ప్రాంతాలు ఉన్నాయి.
ఇలాంటి పరిస్థితుల్లో మెట్రో స్తంభాలు, వయాడక్ట్ ఎత్తు, వంపులు, స్టేషన్ ప్రాంతాల రూపకల్పనలో మార్పులు చేస్తూ వీలైనంత వరకు మతపరమైన, వారసత్వ కట్టడాలను కాపాడే ప్రయత్నం చేశారు. దాదాపు అన్నింటినీ కాపాడేలా ఇంజినీరింగ్ పరిష్కారాలు రూపొందించారు. ఒక దశలో ప్రభావితమయ్యే నిర్మాణాల సంఖ్యను 18కు, ఆ తర్వాత ఇప్పుడు కేవలం నాలుగుకు తగ్గించగలిగారు. పాతబస్తీ మెట్రో విషయంలో హెరిటేజ్ పరిరక్షణ అంశం కీలకంగా మారి న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. పురావస్తు కట్టడాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపడుతున్నట్టు ప్రభుత్వం ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందిన హైకోర్టు నిర్మాణాల తొలగింపు పనుల నిలిపివేతకు ఆమోదించకుండా, మెట్రో నిర్మాణ పనులు కొనసాగించవచ్చని తీర్పు ఇవ్వడంతో మరింత వేగవంతంగా పనులు కొనసాగుతున్నాయి. భూసేకరణ అంశం కూడా పాతబస్తీలో పెద్ద సమస్యగా మారింది. చాలా ఆస్తులు చిన్నచిన్న వ్యాపార సంస్థలు, నివాసాలు, పాత భవనాలుగా ఉండటంతో భూసేకరణ ప్రక్రియ సులభంగా సాగలేదు. మెట్రో నిర్మాణానికి అవసరమైన రహదారి వెడల్పు, ఆస్తుల నష్టం, పరిహారం వంటి అంశాలపై స్థానికంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అందువల్ల రాజకీయంగా కూడా ఈ అంశం అత్యంత సున్నితంగా మారింది. ఒక ప్రభుత్వం ప్రణాళికలు ప్రకటించడం, మరో ప్రభుత్వం వాటిని పునఃసమీక్షించడం వంటి పరిణామాలతో పనులకు నిత్యం బ్రేకులు పడ్డాయి. ప్రభుత్వంలో చిత్తశుద్ధి ఉంటే పనులు పూర్తి అవుతాయని చెప్పడానికి సుల్తాన్ బజార్‌లో మెట్రో రైలు నిర్మాణమే నిదర్శనం.జెబిఎస్ ఫలక్‌నుమా మార్గంలో వ్యాపారాలకు కీలకమైన సుల్తాన్ బజార్‌లో కూడా పాతబస్తీవలే పలు అభ్యంతరాలు ఎదురైనా నాటి ప్రభుత్వం ముందుకెళ్లింది కానీ, అదే సమయంలో పాతబస్తీలో మాత్రం రాజకీయాల ఒత్తిడికి లొంగడంతో ఆ లైన్ ఎంజిబిఎస్ వరకే పరిమితమైంది. సమస్యలకు రాజకీయ రంగు పులమడం కంటే, వాటిని పరిష్కరించి పనులు పూర్తి చేయడమే ముఖ్యమన్న దిశగా ప్రస్తుత ప్రభుత్వం పాతబస్తీలో ముందుకు సాగుతుండడం ఆహ్వానించదగ్గ పరిణామం. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యూహాత్మకంగా పాతబస్తీ పనులను ప్రారంభించి భూసేకరణలో భాగంగా 90 శాతం వరకు కట్టడాలను విజయవంతంగా తొలగించగలిగింది.

స్మార్ట్‌ఫోన్ ధరలకు మళ్లీ షాక్...



స్మార్ట్‌ఫోన్ తయారీలో కీలకమైన మెమరీ, చిప్‌సెట్ ధరలు విపరీతంగా పెరగడంతో ప్రముఖ ఫోన్ కంపెనీలు తగ్గిన లాభాల కాపాడుకునేందుకు ధరలు పెంచేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థికంగా ఆచి తూచి ఖర్చు చేస్తున్న వినియోగదారులకు శాంసంగ్, రియల్‌మీ, ఒప్పో, వివో, వన్‌ప్లస్ వంటి దిగ్గజ బ్రాండ్లు ఎంపిక చేసిన మోడళ్లపై భారీగా ధరలు పెంచి పెద్ద షాక్ ఇచ్చాయి. ఆగస్టు రెండో వారం తర్వాత నుంచి రియల్‌మీ రూ. 1,000 నుండి రూ. 4,000 వరకు, ఒప్పో రూ. 5,000 వరకు, అలాగే వన్‌ప్లస్ రూ. 4,000 వరకు ధరలను పెంచాయి. ఇక శాంసంగ్ ఏకంగా తమ గెలాక్సీ ఎస్25 వేరియంట్‌పై అత్యధికంగా రూ. 12,000 పెంచడం గమనార్హం. పెరిగిన ధరల వల్ల ఏప్రిల్-జూలై మధ్య స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే బాగా క్షీణించాయని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తెలిపింది. అమెజాన్ ప్రైమ్ డే, ఫ్లిప్‌కార్ట్ సేల్స్ సమయంలో కొంత అమ్మకాలు కనిపించినప్పటికీ, ఆఫర్లు ముగియగానే మళ్లీ మార్కెట్ పడిపోయింది. ఈ ఏడాది ప్రథమార్ధంలోనే సగటు స్మార్ట్‌ఫోన్ ధరలు 15 శాతం పెరిగాయని, విడిభాగాల వ్యయం ఇలాగే కొనసాగితే రాబోయే నెలల్లో మరో 7-10 శాతం ధరలు పెరిగే అవకాశముందని ఐడీసీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల వల్ల 2026లో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్ దాదాపు 13 శాతం తగ్గొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే రాబోయే పండుగ సీజన్లో కంపెనీలు ఇచ్చే ప్రత్యేక డిస్కౌంట్లు, నో-కాస్ట్ ఈఎంఐలు, ఫైనాన్సింగ్ ఆప్షన్లు మాత్రమే వినియోగదారులకు కొంత ఊరటనిచ్చి, మార్కెట్ పుంజుకోవడానికి సహాయపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఒరాకిల్‌లో ఉద్యోగాల కోతలు...!



టెక్ దిగ్గజ కంపెనీలలో ఒక్కటైన ఒరాకిల్ మరోసారి ఉద్యోగాల కోతలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు కొనసాగిస్తూనే ఉద్యోగుల వ్యయాన్ని తగ్గించేందుకు ఈ నెలలో కొత్త లేఆఫ్స్ చేపట్టాలని కంపెనీ యోచిస్తున్నట్లు ప్రముఖ నివేదిక వెల్లడించింది.బిజినెస్ ఇన్‌సైడర్ ప్రకారం.. ఒరాకిల్‌లో లేఆఫ్స్‌కు గురయ్యే ఉద్యోగులను గుర్తించాలని మేనేజర్లను కంపెనీ ఆదేశించింది. సెప్టెంబర్ 1న కంపెనీ రెండో ఆర్థిక త్రైమాసికం ప్రారంభం కానున్న నేపథ్యంలో.. అంతకంటే ముందే ఈ ఉద్యోగాల కోతలను అమలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని టీమ్‌లలో ఉద్యోగుల సంఖ్య రెండంకెల శాతంలో తగ్గే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది.ఈ తాజా లేఆఫ్స్‌కు ముందు కూడా ఒరాకిల్ భారీ స్థాయిలో ఉద్యోగులను తగ్గించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉద్యోగుల సంఖ్య సుమారు 21,000 మేర తగ్గింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 13 శాతానికి సమానం. దీంతో ఒరాకిల్‌లో ఉద్యోగుల సంఖ్య సుమారు 1,41,000కు చేరుకుంది.మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఒరాకిల్ భారీగా ఖర్చు చేస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ంఎ సంబంధిత మౌలిక సదుపాయాల కోసం కంపెనీ సుమారు 55.7 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ పెట్టుబడులకు మద్దతుగా కంపెనీ సుమారు 43 బిలియన్ డాలర్లను అప్పుగా తీసుకున్నట్లు సమాచారం.
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 40 బిలియన్ డాలర్లను డెట్, ఈక్విటీ ద్వారా సమీకరించాలని కూడా ఒరాకిల్ ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. భారీగా పెట్టుబడులు పెడుతున్నప్పటికీ ఒరాకిల్ క్లౌడ్ వ్యాపారానికి డిమాండ్ కొనసాగుతోంది. ముఖ్యంగా ంఎ కంప్యూటింగ్ సామర్థ్యానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా కంపెనీ క్లౌడ్ సేవల ఆదాయం గణనీయంగా పెరుగుతోంది.
అయితే ంఎ మౌలిక సదుపాయాలపై కంపెనీ భారీగా చేస్తున్న ఖర్చులు పెట్టుబడిదారుల్లో ఆందోళనలకు కారణమవుతున్నాయి. ఈ ఏడాది ఒరాకిల్ షేర్లు గణనీయంగా పడిపోయినట్లు సమాచా రం. తాజా ఉద్యోగాల కోతలపై ఒరాకిల్ లేదా కంపెనీ ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ఈ లేఆఫ్స్‌కు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది.

తెలంగాణలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ జోరు...



ప్రముఖ బీమా సంస్థ 'ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్' తెలంగాణ మార్కెట్లో తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ, 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టర్మ్ ప్లాన్ వ్యాపారంలో ఏకంగా 60.7 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి తెలంగాణలో రూ. 11,708 కోట్ల నిర్వహణ ఆస్తులు (ఏయూఎం), రూ. 1,52,016 కోట్ల మొత్తం సమ్ అస్యూర్డ్ కలిగి ఉన్న సంస్థ, రాష్ట్రంలో 6.56 లక్షలకు పైగా ప్రజలకు బీమా కవరేజీని అందిస్తోంది.
ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతతో 97 శాతం సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తూ, 99.3 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తితో కేవలం ఒక్క రోజులోనే విచారణ లేని క్లెయిమ్‌లను పరిష్కరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 11 సొంత బ్రాంచీలు, 3,934
పర్ట్‌నర్ బ్రాంచీలు, 6,100 మందికి పైగా అడ్వైజర్లతో విస్తృత నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నామని సంస్థ తెలిపింది. త్వరలో కంపెనీ పేరును 'ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్'గా మారనుందని, తెలంగాణ మార్కెట్లో డిజిటల్ సేవల ద్వారా మరింత విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించింది.

రక్తదానం ఎవరు చేయొచ్చు?



మనం చేసే రక్తదానం అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఎంతో మంది ప్రాణాలను కాపాడటంలో సహాయపడుతుంది. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయంలో రక్తస్రావం, తీవ్రమైన అనారోగ్యాలు వంటి అనేక సందర్భాల్లో రక్తం అవసరం అవుతుంది. అయితే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి అర్హులు కాదు. కొన్ని ఆరోగ్య పరిస్థితుల్లో తాత్కాలికంగా రక్తదానం చేయకూడదు. మరికొన్ని సందర్భాల్లో దీర్ఘకాలం లేదా శాశ్వతంగా రక్తదానానికి దూరంగా ఉండాల్సి రావచ్చు. అందుకే రక్తదానం చేయాలనే ఆసక్తి మాత్రమే కాకుండా.. మన ఆరోగ్య పరిస్థితి గురించి రక్తదానం చేసే కేంద్రంలోని వైద్య సిబ్బందికి సరైన సమాచారం అందించడం కూడా చాలా ముఖ్యం. భారత్‌లో సాధారణంగా రక్తదానం చేయాలంటే వ్యక్తి వయసు 18 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉండాలి. తొలిసారి రక్తదానం చేసే వ్యక్తి వయసు 60 సంవత్సరాలకు మించకూడదు. రెగ్యులర్‌గా రక్తదానం చేసేవారికి గరిష్ఠ వయసు 65 సంవత్సరాలుగా ఉంటుంది. రక్తదాత బరువు కనీసం 45 కిలోల ఉండాలి. 350 మి.లీ. రక్తదానం చేయడానికి కనీసం 45 కిలోల బరువు అవసరం కాగా.. 450 మి.లీ. రక్తదానం కోసం సాధారణంగా 55 కిలోల కంటే ఎక్కువ బరువు ఉండాలి. రక్తదానం చేసే ముందు హీమోగ్లోబిన్, రక్తపోటు, పల్స్, శరీర ఉష్ణోగ్రతతో పాటు ఇతర ఆరోగ్య ప్రమాణాలను వైద్య సిబ్బంది పరిశీలిస్తారు. 2025లో అమల్లో ఉన్న రక్తదాతల ఎంపిక మార్గదర్శకాల ప్రకారం పురుషులు సాధారణంగా 90 రోజుల విరామంతో, మహిళలు 120 రోజుల విరామంతో మరోసారి పూర్తి రక్తాన్ని దానం చేయవచ్చు. అయితే తుది అర్హతను రక్తదాన కేంద్రంలోని వైద్య పరీక్షల తర్వాతే నిర్ణయిస్తారు. జ్వరం, ఫ్లూ, వైరల్ ఇన్ఫెక్షన్ లేదా ఇతర క్రియాశీల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న సమయంలో రక్తదానం చేయకూడదు. పూర్తిగా కోలుకున్న తర్వాతే రక్తదానం చేయడం మంచిది. ఇటీవల ఏదైనా అనారోగ్యానికి గురైనట్లయితే.. రక్తదానం చేసే ముందు వైద్య సిబ్బందికి తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలి. రక్తదానానికి కనీస బరువు ప్రమాణం ఉంటుంది. బరువు తక్కువగా ఉన్న వ్యక్తి నుంచి రక్తం తీసుకోవడం వల్ల దాత ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే రక్తదానం చేసే ముందు బరువును కూడా పరీక్షిస్తారు. గర్భధారణ సమయంలో మహిళలు రక్తదానం చేయకూడదు. ఈ సమయంలో తల్లి, గర్భంలోని శిశువు ఇద్దరికీ తగినంత పోషకాలు, రక్త సరఫరా అవసరం ఉంటుంది. ప్రసవం తర్వాత కూడా వెంటనే రక్తదానం ప్రారంభించకూడదు.

డ్రాగన్ ఫ్రూట్ అందరికీ మంచిదేనా..?



డ్రాగన్ ఫ్రూట్ చూడటానికి ఆకర్షణీయంగా ఉండటమే కాకుండా, ఫైబర్, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు ఉండే పండుగా చాలామందికి తెలుసు.

అందుకే ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టేవారు, బరువు నియంత్రించుకోవాలనుకునేవారు దీన్ని తమ ఆహారంలో చేర్చుకుంటున్నారు. అయితే ఒక ఆహారం ఆరోగ్యకరమైనదని చెప్పడం మాత్రమే కాకుండా, అది ఎవరికి ఎలా సరిపోతుందో కూడా తెలుసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు డ్రాగన్ ఫ్రూట్‌ను ఎక్కువగా తీసుకుంటే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. అలర్జీలు, మధుమేహం లేదా మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు డ్రాగన్ ఫ్రూట్‌ను తీసుకునే విషయంలో ప్రత్యేక జాగ్రత్త అవసరం. అయితే ప్రతి ఒక్కరూ ఈ పండును పూర్తిగా మానేయాల్సిన అవసరం ఉందని చెప్పడం సరికాదు. వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, తీసుకుంటున్న మందులు, ఆహారపు అలవాట్లను బట్టి పరిమాణం మారవచ్చు. మరి ఎలాంటి వారు డ్రాగన్ ఫ్రూట్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి? డ్రాగన్ ఫ్రూట్ తిన్న తర్వాత కొంతమందిలో అలర్జీ ప్రతిచర్యలు కనిపించే అవకాశం ఉంది. దురద, పెదవులు లేదా నాలుక వాపు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే దీనిని తినడం ఆపాలి. ముఖ్యంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి తీవ్రమైన లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

లవంగాల పాలు ఔషధాల గని...



సీజన్ మారిన ప్రతిసారి వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల జలుబు, దగ్గు, జ్వరం, కీళ్ల నొప్పులు వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి లవంగాల పాలు అద్భుతమైన ఔషధంగా పనిచేస్తాయి. భారతీయ వంటింట్లో దొరికే లవంగాలు, పాల కలయిక శరీరానికి ఎనలేని శక్తిని ఇస్తుంది. ప్రశాంతమైన నిద్ర పడుతుంది.రోగనిరోధక శక్తి పెంపు: లవంగాలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి పాలతో కలిసి తీసుకున్నప్పుడు శరీరంలో రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తాయి. చలికాలంలో వ్యాపించే రకరకాల ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని కాపాడటంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. జలుబు, గొంతు నొప్పి నుండి ఉపశమనం: లవంగాలలో ఉండే యూజినాల్ అనే కాంపౌండ్ యాంటీబాక్టీరియల్, యాంటీవైరల్ గుణాలను కలిగి ఉంటుంది.

గొంతు నొప్పి, పొడి దగ్గు, నాసికా రంధ్రాల మూసుకుపోవడం వంటి సమస్యలతో బాధపడేవారు లవంగాల పాలు తాగడం వల్ల తక్షణ ఉపశమనం లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది: రాత్రి వేళ లవంగాల పాలు తాగడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. ఇది కడుపు ఉబ్బరం, గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలను సమర్థవంతంగా నివారిస్తుంది. ఆహారం త్వరగా అరగడానికి సహాయపడుతుంది. ఎముకలు, పళ్ల ఆరోగ్యానికి మేలు: పాలలో క్యాల్షియం, విటమిన్ డి సమృద్ధిగా ఉంటాయి. లవంగాలలో ఉండే మాంగనీస్ ఎముకల సాంద్రతను పెంచడానికి ఉపయోగపడుతుంది.

వర్షాకాలంలో ఖర్జూరాలు తినొచ్చా?



ఖర్జూరాలు ప్రకృతి మనకు అందించిన అత్యంత తీపి, పోషకమైన పండ్లలో ఒకటి. ప్రాసెస్ చేసిన స్వీట్లకు ప్రత్యామ్నాయంగా, ఆరోగ్యకరమైన తీపిని కోరుకునే వారికి ఇవి ఒక అద్భుతమైన ఎంపిక. వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్లశరీరానికి కావలసిన ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. అయితే, వర్షాకాలంలో ఖర్జూరాలు తినేవారు ఈ విషయాలు తప్పక తెలుసుకోవాలి. పోషకాల గని: ఖర్జూర పండ్లు రుచికే కాకుండా అద్భుతమైన పోషక విలవలకు నిలయం. ఒక మోస్తరు పరిమాణంలో ఉండే ఖర్జూరాల్లో శరీరానికి అవసరమైన విటమిన్ ఃబ, పొటాషియం, మెగ్నీషియం, రాగి, మాంగనీస్, ఐరన్ సమృద్ధిగా లభిస్తాయి. వీటిలో కొవ్వు పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. జీర్ణ వ్యవస్థకు కొండంత అండ: ఖర్జూరాలలో పీచు పదార్థం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, ప్రేగుల కదలికలను క్రమబద్ధీకరిస్తుంది. క్రమం తప్పకుండా ఖర్జూరాలు తీసుకోవడం వల్లమలబద్ధకం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు నయమవుతాయి. తక్షణ శక్తి, మెరుగైన గుండె ఆరోగ్యం: ఇందులో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజసిద్ధమైన చక్కెరలు ఉండటం వల్ల నీరసంగాఉన్నప్పుడు ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. అలాగే, ఖర్జూరాల్లోని పొటాషియం, మెగ్నీషియం సోడియం ప్రభావాన్ని తగ్గించి, రక్తపోటును అదుపులో ఉంచుతాయి. ఇవి రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ చేరకుండా కాపాడి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

దమ్ము, ధైర్యం ఉంటే క్లారిటీగా మాట్లాడు!



ప్రముఖ యాంకర్, నటి అనసూయ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. కొంతకాలం క్రితం ఆమె సోషల్ మీడియాలో దేవుడి ఫొటోలు పెట్టుకుని 'జై శ్రీరామ్' అంటూ 'జై హింద్', 'వందేమాతరం' వంటి పదాలను ప్రస్తావిస్తూ ఓ వీడియో విడుదల చేసింది. అందులో ఆమె చేసిన వ్యాఖ్యలపై పలువురు ఫైర్ అయ్యారు. ఆ తర్వాత అనసూయ దీనిపై క్లారిటీ ఇస్తూ మరో వీడియోను కూడా విడుదల చేసింది. తాజాగా టాలీవుడ్ సీనియర్ నటి హేమ, అనసూయ వ్యాఖ్యలపై స్పందించింది. ఈ సందర్భంగా హేమ మాట్లాడుతూ.. మనం అద్దాల మేడలో బతుకుతున్నాం. మనం చేసే ప్రతి పనినీ భూతద్దంలో పెట్టి చూస్తుంటారు. నీ పర్సనల్ జీవితం నీ ఇష్టం. కానీ కోట్ల మంది విశ్వసించే విషయాల గురించి మాట్లాడుతున్నప్పుడు ఎంతో జాగ్రత్తగా మాట్లాడాలి. మనం మాట్లాడే మాటలకు, చేసే పనులకు సంబంధం లేకపోతే ప్రజలు ఈజీగా పసిగట్టేస్తారు. జై శ్రీరామ్ అనేది ఒక స్లోగన్ కాదు. కోట్ల మంది హృదయాల్లో నిలిచిపోయిన ఒక మంత్రం.

జై శ్రీరామ్ అనేది ఒక పవర్. నువ్వు ఎవరినైనా అనాలి అనుకున్నప్పుడు సూటిగా ఆ వ్యక్తి పేరు చెప్పి అనాలి. కానీ నువ్వు దేవుళ్ల ఫొటోలు పెట్టుకుని జై శ్రీరామ్ అంటూ మరికొన్ని పదాలు అన్నావు. అవి నాకు నచ్చలేదు. నువ్వు అలా అనడం సరికాదు. ఆ తర్వాత నువ్వు అందరినీ అనలేదని అన్నావు.

నువ్వు ఎవరిని ఉద్దేశించి అన్నావో దమ్ము, ధైర్యం ఉంటే వారి పేరు పెట్టి నేరుగా అనాలి. అంతేకానీ హిందువుల మనోభావాలను దెబ్బతీయకు. కర్మ రిటర్న్స్‌ను నేను కచ్చితంగా నమ్ముతాను. నువ్వు చేసిన దానికి కూడా కచ్చితంగా అనుభవిస్తావని హేమ వ్యాఖ్యానించింది. తాజాగా హేమ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి.

అమ్మోరు పాత్రలో మళ్లీ నయనతార



లేడీ సూపర్‌స్టార్ నయనతార మరోసారి దేవత పాత్రలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 2020లో జియోహాట్‌స్టార్ ఓటీటీలో నేరుగా విడుదలై మంచి స్పందన అందుకున్న 'మూకుతి అమ్మన్'కు ఇప్పుడు సీక్వెల్‌గా 'మూకుతి అమ్మన్ 2' తెరకెక్కుతోంది. దర్శకుడు సుందర్ సి రూపొందిస్తున్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే అంచనాలు కూడా బాగానే ఉన్నాయి. అయితే ఈ సినిమా విడుదలకు ముందే డిజిటల్ హక్కుల విషయంలో కూడా పెద్ద వార్త వినిపిస్తోంది. జియోహాట్‌స్టార్ ఈ సినిమా ఓటీటీ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం 'మూకుతి అమ్మన్ 2' డిజిటల్ హక్కుల కోసం జియోహాట్‌స్టార్‌తో చిత్రబృందం ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ డీల్ విలువ ఎంత అన్నది వెల్లడికాలేదు. మొత్తాన్ని బయటపెట్టకపోయినా, ఇది మంచి ఫ్యాన్సీ రేటుకే వెళ్ళినట్లు తెలుస్తోంది. ఈ సీక్వెల్‌లో నయనతార మరోసారి అమ్మన్ (అమ్మోరు తల్లి) పాత్రలో కనిపించనుండగా, ఈసారి కథలో ప్రతినాయకురాలిగా రెజీనా కసాండ్రా నటిస్తున్నట్లు సమాచారం. దర్శకుడు సుందర్ సి తనదైన శైలిలో ఫాంటసీ, కామెడీ, సామాజిక వ్యంగ్యాన్ని కలిపి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. నకిలీ ఆధ్యాత్మిక గురువులను వ్యంగ్యంగా బట్టబయలు చేసే కథ అప్పట్లో మంచి ఆదరణ పొందింది. ముఖ్యంగా సోషల్ మెసేజ్ ని కామెడీ స్టైల్ లో చూపించిన తీరు సినిమాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. మొదటి భాగంలో నయనతారతో పాటు ఆర్.జే. బాలాజీ, ఊర్వశి, స్మృతి వెంకట్, అభినయ, మౌళి, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఆ సినిమా నేరుగా ఓటీటీలో విడుదలైనా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన దక్కించుకుంది. ఇప్పుడు రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా నయనతార చేతిలో వరుస క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. యష్ హీరోగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'టాక్సిక్' లో ఆమె కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆ భారీ పాన్ ఇండియా మూవీ 2026 ఆగస్టు 26న విడుదల కానుంది.

ఆ ఫ్యాన్ గర్ల్ అనుభవం తర్వాత నాకు అసలు నిద్ర పట్టలేదు



తెలుగులో 'పుష్పక విమానం', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న శాన్వి మేఘన, ప్రస్తుతం కోలీవుడ్‌లోనూ అడుగుపెట్టి తన ప్రతిభను చాటుకుంటున్నారు. 'ప్యార్ ప్రేమ కళ్యాణం' చిత్రంతో కోలీవుడ్ ఎంట్రీ ఇవ్వగా ఈ రొమాంటిక్ కామెడీ మూవీ నేరుగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. దర్శకుడిగానే కాకుండా ఎలాన్ ఇందులో హీరోగా పరిచయమవడం విశేషం. యువన్ శంకర్ రాజా సంగీతం అందించిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శాన్వి మేఘన ఓ ఫ్యాన్ గర్ల్ అనుభవాన్ని గుర్తు చేసుకుని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నుంచి ఊహించని మెసేజ్ రావడంతో శాన్వి మేఘన ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఇటీవల తాను నటించిన తమిళ సినిమా 'ప్యార్ ప్రేమ కళ్యాణం' ట్రైలర్‌ను అల్లు అర్జున్‌కు పంపగా, ఆయన దానికి ఎంతో సానుకూలంగా స్పందిస్తూ మెసేజ్ చేసినట్లు శాన్వి వెల్లడించారు. ఒక తెలుగు నటి తమిళ చిత్ర పరిశ్రమలో కూడా రాణించడం చూస్తుంటే తనకు చాలా సంతోషంగా ఉందంటూ బన్నీ ఆమెను అభినందించారని తెలిపారు. అల్లు అర్జున్ ఎంతగానో ప్రోత్సహించే వ్యక్తి అని ప్రశంసిస్తూ శాన్వి ఆ మెసేజ్ చూసిన తర్వాత తనకు రాత్రంతా అసలు నిద్ర పట్టలేదని తన ఆనందాన్ని పంచుకున్నారు.

ఆ క్రేజీ బ్యానర్‌లో శివ నిర్వాణ నెక్స్ట్ సినిమా కన్ఫర్మ్



టాలెంటెడ్ దర్శకుడు శివ నిర్వాణ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈయన తాజాగా రవితేజ హీరోగా తెరకెక్కిన 'ఇరుముడి' చిత్రానికి దర్శకత్వం వహించారు. నిన్న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లను రాబడుతూ ముందుకు దూసుకుపోతోంది. 'టక్ జగదీష్', 'ఖుషి' చిత్రాలతో కాస్త విమర్శలను ఎదుర్కొన్న ఈ దర్శకుడు.. తిరిగి 'ఇరుముడి' చిత్రంతో మంచి ఫామ్‌లోకి వచ్చారు. దీంతో ఈ క్రేజీ దర్శకుడు తన తదుపరి మూవీని ఎవరితో చేస్తారనే ఉత్కంఠ చాలామందిలో నెలకొంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం శివ నిర్వాణ తన తదుపరి మూవీని 'సైన్ స్క్రీన్స్' బ్యానర్‌పై చేయబోతున్నట్లు సమాచారం. బ్యానర్ ఓకే అయినప్పటికీ హీరో మాత్రం ఇంకా కన్ఫామ్ కాలేదని తెలుస్తోంది.

మరి శివ నిర్వాణ తన తదుపరి మూవీని ఏ హీరోతో చేస్తారనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌గా మారింది. ఇప్పటికే ఈ బ్యానర్‌లో శివ నిర్వాణ 'మజిలీ', 'టక్ జగదీష్' అనే రెండు చిత్రాలు చేశారు. ఇందులో 'మజిలీ' అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకోగా, 'టక్ జగదీష్' చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలైంది. ఇప్పుడు ఇదే బ్యానర్‌లో మూడో సినిమా చేయడానికి శివ నిర్వాణ రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది.

ఈయన తాజాగా రవితేజ హీరోగా తెరకెక్కిన 'ఇరుముడి' చిత్రానికి దర్శకత్వం వహించారు. నిన్న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లను రాబడుతూ ముందుకు దూసుకుపోతోంది. 'టక్ జగదీష్', 'ఖుషి' చిత్రాలతో కాస్త విమర్శలను ఎదుర్కొన్న ఈ దర్శకుడు.. తిరిగి 'ఇరుముడి' చిత్రంతో మంచి ఫామ్‌లోకి వచ్చారు. దీంతో ఈ క్రేజీ దర్శకుడు తన తదుపరి మూవీని ఎవరితో చేస్తారనే ఉత్కంఠ చాలామందిలో నెలకొంది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com